



RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

## విలేకరులు కావలెను

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.

సంచిక : 315 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | బుధవారం | 04-03-2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00

## కనువిందు చేసిన చంద్రగ్రహణం

- ప్రపంచంలోని పలు ప్రాంతాల్లో వీక్షణం
- చంద్రగ్రహణం సందర్భంగా చందమామ పూర్తి రక్తవర్ణంలో ప్రకాశవంతం
- భారతదేశంలోని పలు ప్రాంతాలతో పాటు.. ఉత్తర అమెరికా, న్యూజిలాండ్, ఫిలిప్పీన్స్, కాలిఫోర్నియాల్లో సంపూర్ణచంద్రగ్రహణం స్పష్టంగా కనువిందు




న్యూఢిల్లీ,
ప్రపంచ వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో సంపూర్ణ చంద్రగ్రహణం కనువిందు చేసింది. చంద్రగ్రహణం సందర్భంగా చందమామ పూర్తి రక్తవర్ణంలో ప్రకాశవంతంగా మెరిసిపోయింది. భారతదేశంలోని పలు ప్రాంతాలతో పాటు.. ఉత్తర అమెరికా, న్యూజిలాండ్, ఫిలిప్పీన్స్, కాలిఫోర్నియాల్లో సంపూర్ణచంద్రగ్రహణం -మిగతా 2 లో

## ఇరాన్‌పై దాడి పట్ల మౌనమెందుకు




- మోడీ తీరుతో దిగజారుతున్న భారత్ ప్రతిష్ట
- మోడీ తీరుపై మండిపడ్డ రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ,
అమెరికా-ఇజ్రాయిల్-ఇరాన్‌ల వివాదంపై ప్రధాని మోడీ మౌనం ప్రపంచంలో భారత్ ఖ్యాతిని దిగజారుస్తోందని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ మంగళవారం పేర్కొన్నారు. ప్రపంచక్రమాన్ని నిర్వచించడానికి ఒక మార్గంగా దేశాధినేత హత్యకు మద్దతు ఇస్తున్నారా లేదా అనే దానిపై ప్రధాని మోడీ మాట్లాడాలని, సమాధానం చెప్పాలని అన్నారు. ఇరాన్‌పై ఏకపక్ష -మిగతా 2 లో

## ఆగని మారణ హోమం

### 787కు చేరిన మృతులు

- నాలుగో రోజూ కొనసాగిన ఉద్రిక్తతలు.. ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడులు
- 24 గంటల క్రితం బాధ్యతలు చేపట్టిన ఇరాన్ రక్షణ మంత్రి మృతి?
- మొత్తంగా ఇరాన్‌లో ఇప్పటి వరకు 787 మంది మృత్యువాత
- శ్మశానాలను తలపిస్తున్న పాఠశాల ప్రాంగణాలు, ఇతర ప్రాంతాలు
- సౌదీ ఆరేబియాలోని అమెరికా ఎంబసీ, స్థావరాలపై ఇరాన్ దాడులు
- రానున్న 24 గంటల్లో ఇరాన్‌పై మరిన్ని భీకరమైన దాడులు: అమెరికా
- చర్చలకు సిద్ధమని ఇరాన్ అంటున్నా ఇప్పటికే ఆలస్యమైంది: ట్రంప్
- దీర్ఘకాలం యుద్ధానికి వ్యూహాలు సిద్ధం చేసుకొంటున్న ఇరాన్



న్యూఢిల్లీ/
పశ్చిమాసియాలో నాలుగో రోజూ ఉద్రిక్తతలు కొనసాగాయి. దాడులు, ప్రతి దాడులతో అటు ఇరాన్, ఇటు ఇజ్రాయెల్‌తో పాటు గల్ఫ్ దేశాల్లో పరిస్థితులు మరింత దిగజారాయి. యుద్ధం తీవ్రరూపం దాల్చడంతో ఇరాన్ కీలక నిర్ణయం తీసుకొన్నది. ప్రపంచ చమురు రవాణాకు జీవనాడిగా పిలిచే హెర్మూజ్ జల సంధిని మూసివేస్తున్నట్టు ప్రకటించింది. ఈ జలసంధి గుండా నౌకలు వస్తే నిప్పు పెట్టి కాల్చివేస్తామని హెచ్చరించింది. మరోవైపు, తమ సుప్రీం లీడర్ ఖమేనీ హత్యకు ప్రతీకారంగా ఇరాన్ మంగళవారం కూడా దాడులను ముమ్మరం చేసింది. సౌదీలోని అమెరికా ఎంబసీపై, బహ్రెయిన్‌లోని అమెరికా ఎయిర్‌బేస్‌పై, కువైట్‌లోని అమెరికా స్థావరంపై డ్రోన్ దాడులతో విరుచుకుపడింది. దీనికి బదులుగా ఇరాన్ అధ్యక్ష భవనంతోపాటు సెక్యూరిటీ కౌన్సిల్ -మిగతా 2 లో

## ప్రజలకు సంక్షేమ పథకాలు చేరవేయాలి

### 99 రోజుల కార్యాచరణలో అందరూ భాగస్వామ్యం కావాలి

- విద్యావ్యవస్థలో మార్పులపై ప్రజలకు అవగాహన కల్పించాలి
- ఈ 99 రోజులు కలెక్టర్లు జిల్లా వీడి రావద్దు
- మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు సకాలంలో బిల్లుల చెల్లింపు
- గ్రామస్థాయి నుంచి ప్రజాప్రతినిధుల భగస్వామ్యం ఉండాలి
- కలెక్టర్ల సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి స్పష్టమైన ఆదేశాలు

హైదరాబాద్ మార్చి 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):
రాష్ట్రంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి కలెక్టర్లను ఆదేశించారు. రేషన్ కార్డులు, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌పై లబ్దిదారుల అభిప్రాయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. సచివాలయంలో కలెక్టర్లతో సీఎం సమావేశమయ్యారు. ప్రజా పాలన- ప్రగతి ప్రణాళికపై కలెక్టర్లకు దిశా నిర్దేశర చేశారు. 99 రోజుల కార్యాచరణలో అందరి భాగస్వామ్యం ఉండాలని సీఎం పిలుపునిచ్చారు. గ్రామం నుంచి జిల్లా స్థాయి వరకు ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం ఉండాలి. -మిగతా 2 లో



## ఇరాన్‌పై అమెరికా దాడులు తొలిసారిగా స్పందించిన చైనా

వెంటనే కాల్పుల విరమణ ప్రకటించాలని డిమాండ్

2 లో



## ఏజెన్సీ, చిత్తూరుల్లో ఏనుగుల సమస్య పరిష్కరించాం

- హనుమాన్ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టిన డిప్యూటి సిఎం
- అటవీ సరిహద్దు గ్రామాల్లో అలర్ట్ వ్యవస్థ ఏర్పాటు
- ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం సందర్భంగా పవన్ కళ్యాణ్



అమరావతి,మార్చి 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):
రాష్ట్రంలోని ఏజెన్సీ ప్రాంతాలు, చిత్తూరు జిల్లాలో ఏనుగుల సమస్యను పరిష్కరించామని ఎపి డిప్యూటి సిఎం పవన్ కల్యాణ్ అన్నారు. మంగళవారం వన్యప్రాణుల సంరక్షణ కోసం ఎపి ప్రభుత్వం 'హనుమాన్' ప్రాజెక్టు ప్రారంభోత్సవంను మంగళగిరిలో నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. అటవీ సరిహద్దు గ్రామాల్లో అలర్ట్ వ్యవస్థ ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్ర అటవీశాఖ చరిత్రలో ఇదో కీలక అడుగు అని చెప్పారు. -మిగతా 2 లో

## చర్చలకు సిద్ధమన్న ఇరాన్

- తోసిపుచ్చిన అమెరికా అధ్యక్షుడు
- ఇప్పటికే ఆలస్యమైందని ట్రంప్ వ్యాఖ్య
- ఆయుధ నిల్వలపై అనుమానాలొద్దని వెల్లడి



న్యూయార్క్,మార్చి 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):
ఇరాన్‌పై యుద్ధం కొనసాగుతున్న వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. చర్చలకు సిద్ధమని ఇరాన్ నేతలు చెప్పారని.. అయితే, ఇప్పటికే ఆలస్యమైందని చెప్పినట్టు పేర్కొన్నారు. ఇరాన్ నాయకత్వంతోపాటు ఆ దేశ గగనతల రక్షణ, వాయుసేన, నౌకాదళ వ్యవస్థలన్నీ తుడిచిపెట్టుకుపోయినట్టు తెలిపారు. ఈ మేరకు సొంత సోషల్ -మిగతా 2 లో



## మోదీకి నెతన్యాహు కృతజ్ఞతలు..

- ఇజ్రాయెల్‌కు అండగా ఉన్నారని వ్యాఖ్య

బీట్ షెమేష్,
తన గొప్ప స్నేహితుడు ప్రధాని నరేంద్ర మోదీతో మాట్లాడానని, పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో ఇజ్రాయెల్‌కు అండగా నిలబడినందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపానని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు తెలిపారు.ఇజ్రాయెల్‌లోని బీట్ షెమేష్‌లో ఓ ప్రార్థనా మందిరంపై ఇరాన్ జరిపిన దాడుల్లో 9 మంది మరణించగా ఆ ప్రదేశంలోని శిథిలాలను నెతన్యాహు తన అంగరక్షకుల మధ్య సోమవారం సందర్శించారు. నాకు గొప్ప స్నేహితుడైన నరేంద్ర మోదీ తో నిన్న సుదీర్ఘంగా మాట్లాడాను. ఇజ్రాయెల్‌కు, సత్యానికి అండగా నిలబడినందుకు, భారత ప్రజల అపార మైత్రికి కృతజ్ఞతలు తెలిపాను అని నెతన్యాహు చెప్పారు.

## పేదలకో న్యాయం.. పెద్దలకో న్యాయమా?

### నార్సింగి మూసీలో నిర్మిస్తున్న లగ్జరీ భవనాలనూ కూల్చాలి

- మధు పార్క్ నివాసితులకు అండగా ఉంటాం
- హైడ్రా కమిషనర్ నార్సింగికి రావాలి : తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత
- బాధితులతో కలిసి ఆందోళన
- కవిత అరెస్టు, అనంతరం విడుదల



గండిపేట్ మార్చి 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):
మూసీ సుందరీకరణ పేరుతో పేదల భూములను గుంజుకుని, లగ్జరీ అపార్ట్‌మెంట్లకు అమ్మేందుకు హైడ్రా వ్యాపారం చేస్తోందని, పేదలకో న్యాయం, పెద్దలకో న్యాయమా..? అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా నార్సింగి సర్కిల్‌లోని మూసీ నది మధ్యలో ఆక్రమించి నిర్మిస్తున్న భారీ రియల్ ఎస్టేట్ వెంచర్‌పై, అక్రమ లగ్జరీ ఆదిత్య కన్‌స్ట్రక్షన్‌పై చర్యలు తీసుకోవాలని ఆందోళన చేపట్టారు. మధుపార్క్ నివాసితులతో కలిసి నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, -మిగతా 2 లో

## రేపు 'పది' హాల్‌టికెట్ల విడుదల

- ఈ సారి మూడు రకాలుగా హాల్‌టికెట్లు అందుబాటులోకి
- వీటిని బోర్డు వెబ్‌సైట్‌లో విడుదల చేయడంతోపాటు తల్లిదండ్రుల వాట్సాప్‌కు సైతం విడుదల
- అదే తేదీలోపు ప్రింటెడ్ హాల్‌టికెట్లను సైతం స్కూళ్లకు చేరవేస్తారు
- పదో తరగతి వార్షిక పరీక్షలు మార్చి 14 నుంచి ఏప్రిల్ 16 వరకు జరుగనున్న విషయం తెలిసిందే.



హైదరాబాద్, మార్చి 3
పదో తరగతి వార్షిక పరీక్షల హాల్‌టికెట్లు గురువారం విడుదల కానున్నాయి. ఈ సారి మూడు రకాలుగా హాల్‌టికెట్లు అందుబాటులో ఉంటాయి. వీటిని బోర్డు వెబ్‌సైట్‌లో విడుదల చేయడంతోపాటు తల్లిదండ్రుల వాట్సాప్‌కు సైతం పంపిస్తారు. -మిగతా 2 లో

# కనువిందు చేసిన చంద్రగ్రహణం

మొదటి తరువాయి




స్పష్టంగా కనిపించింది. ఆయా దేశాల్లో రక్తవర్ణంలో కనువిందు చేసిన చంద్రుడి ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. చంద్రగ్రహణం మధ్యాహ్నం 3.20 గంటలు ప్రారంభమయ్యింది. సాయంత్రం 4.34 గంటలకు సంపూర్ణ చంద్రగ్రహణం ఏర్పడింది. 5.33 గంటలకు సంపూర్ణ చంద్రగ్రహణం వీడింది. అయితే, 6.47 గంటలకు గ్రహణం వీడుతుందని తెలిపారు.. ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల్లో కనిపించిన ఈ సంపూర్ణ చంద్రగ్రహణం మన దేశంలో మాత్రం కొన్ని చోట్ల మాత్రమే కనిపించింది.

## ఇరాన్‌పై దాడి పట్ల మౌనమెందుకు

మొదటి తరువాయి

దాడులతో పాటు, ఇతర మధ్యప్రాచ్య దేశాలపపై ఇరాన్ దాడులను ఖండించాలని ఆయన అన్నారు. అమెరికా, ఇజ్రాయిల్ దాడుల్లో ఇరాన్ అధ్యక్షుడు ఖమేనీని హత్య చేసిన సంగతి తెలిసిందే. అమెరికా-ఇజ్రాయిల్-ఇరాన్‌ల మధ్య పెరుగుతున్న వైరుధ్యాలు సున్నితమైన ప్రాంతాన్ని తీవ్ర సంఘర్షణ వైపు నెడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సుమారు కోటిమంది భారతీయులతో సహా కోట్లాది మంది ప్రజలు అనిశ్చితిని ఎదుర్కొంటున్నారని అన్నారు. భద్రతాపరమైన ఆందోళనలు వాస్తవమే అయినప్పటికీ, సార్వభౌమత్వాన్ని ఉల్లంఘించే దాడులు సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేస్తాయి. ఇరాన్‌పై ఏకపక్ష దాడులు, అలాగే ఇతర మధ్యప్రాచ్య దేశాలపై ఇరాన్ దాడులను ఖండించాలి. ఘర్షణలు మరింత ఘర్షణలకు దారితీస్తాయి. చర్చలు మరియు సంయమనం శాంతికి ఏకైక మార్గం అని అన్నారు. భారతదేశం నైతికంగా స్పష్టంగా ఉండాలి. అంతర్జాతీయ చట్టం మరియు మానవుల ప్రాణాలను కాపాడుకోవడంలో మనం స్పష్టంగా మాట్లాడే ధైర్యం కలిగి ఉండాలి. మన విదేశాంగ విధానం సార్వభౌమాధికారం మరియు వివాదాల శాంతియుత పరిష్కారాన్ని సూచిస్తుంది. అది స్థిరంగా ఉండాలని అన్నారు. మధ్యప్రాచ్యం సంఘర్షణపై ప్రధాని మోడీ మాట్లాడాలని పునరుద్ఘాటించారు. ప్రపంచ క్రమాన్ని నిర్వచించే మార్గంగా ఒక దేశాధినేత హత్యను సమర్థిస్తారా అని ప్రధాని మోడీని నిలదీశారు.

## ఇరాన్‌పై అమెరికా దాడులు తొలిసారిగా స్పందించిన చైనా

వెంటనే కాల్పుల విరమణ ప్రకటించాలని డిమాండ్



బీజింగ్, ఇరాన్‌పై అమెరికా దాడులను చైనా ఖండించింది. తక్షణం కాల్పుల విరమణ ప్రకటించాలని సూచించింది. లేని పక్షంలో ఈ ఘర్షణలు ఇతర దేశాలకు విస్తరించే ప్రమాదం ఉందని హెచ్చరించింది. గల్ఫ్ ప్రాంతంలోని అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్ దాడులు చేస్తున్న నేపథ్యంలో చైనా విదేశాంగ శాఖ ఈ ప్రకటనను విడుదల చేసింది. అన్ని సైనిక చర్యలకూ ముగింపు చెప్పడం తక్షణ అవసరమని వ్యాఖ్యానించింది. చర్చల ద్వారా వివాదాలను పరిష్కరించుకోవాలని చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి సూచించారు. అమెరికా నేతృత్వంలో జరుగుతున్న దాడులు అంతర్జాతీయ చట్టాలకు వ్యతిరేకమని కూడా చైనా కామెంట్ చేసింది. ఈ దాడులకు ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి అనుమతి లేదని పేర్కొంది. ఉద్రిక్తతలు అంతకంతకూ పెరుగుతున్న నేపథ్యంలో భద్రతా మండలి అత్యవసర ప్రాతిపదికన సమావేశం కావాలని చైనా సూచించింది. గల్ఫ్ దేశాల సార్వభౌమత్వం, భద్రత, ప్రాదేశిక సమగ్రతను గౌరవించాలని స్పష్టం చేసింది. రష్యా విదేశాంగ శాఖ మంత్రి సెర్గీ లావ్రోవ్‌తో చైనా విదేశాంగ శాఖ మంత్రి వాంగ్ ఈ విషయమైన ఫోన్‌లో మాట్లాడారు. శాంతి నెలకొల్పే దిశగా ప్రయత్నాలు జరగాలని చెప్పారు. త్వరలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చైనాలో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో ఇరు దేశాలు నిరంతరం టచ్‌లో ఉన్నాయని కూడా విదేశాంగ శాఖ ప్రతినిధి తెలిపారు. ఇక ఇరాన్‌లో చిక్కుకున్న చైనీయులను స్వదేశానికి తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని కూడా చైనా ప్రభుత్వం తెలిపింది. ఇప్పటికే 3 వేల మంది చైనీయులను స్వదేశానికి తీసుకొచ్చామని పేర్కొంది.ం

## రేపు ‘పది’ హాల్‌టికెట్ల విడుదల

మొదటి తరువాయి




అదే తేదీలోపు ప్రింటెడ్ హాల్‌టికెట్లను సైతం స్కూళ్లకు చేరవేస్తారు. హాల్‌టికెట్ల కోసం <https://bse.telan-gana.gov.in> వెబ్‌సైట్‌నూ సంప్రదించవచ్చు.లేదంటే వాట్సాప్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. కుదరని పక్షంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడిని సంప్రదించి పొందవచ్చు. విద్యార్థులు ఏ హాల్‌టికెట్‌తో వచ్చినా పరీక్షలకు అనుమతిస్తారు. పదో తరగతి వార్షిక పరీక్షలు మార్చి 14 నుంచి ఏప్రిల్ 16 వరకు జరుగనున్న విషయం తెలిసిందే. 5,28,248 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

# ఆగని మారణ హోమం

మొదటి తరువాయి

భవనాలపై ఇజ్రాయెల్ దాడులను తీవ్రతరం చేసింది. రానున్న 24 గంటల్లో ఇరాన్‌పై భీకర దాడులు చేయనున్నట్టు అమెరికా హెచ్చరించింది. చర్చలకు సిద్ధమని ఇప్పుడు ఇరాన్ ముందుకు వచ్చిందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అన్నారు. అయితే ఇప్పటికే ఆలస్యమైందని తాను బదులిచ్చినట్టు చెప్పారు. కాగా యుద్ధం మొదలైనప్పటి నుంచి ఇప్పటిదాకా ఇరాన్‌లో 787 మంది మరణించినట్టు సమాచారం. 24 గంటల కిందట ఇరాన్ రక్షణ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన మజీద్ ఇబెన్ అల్-రెజా కూడా ఇజ్రాయెల్ దాడుల్లో మరణించినట్టు మీడియాలో కథనాలు వెలువడ్డాయి.



**పెట్రోల్, గ్యాస్ ధరలు పెరుగుతాయా?**

హెర్మూజ్ జలసంధిని మూసివేస్తున్నట్టు ఇరాన్ మంగళవారం ప్రకటించింది. ఈ జలసంధి గుండా నౌకలు వస్తే నిప్పు పెట్టి కాల్చివేస్తామని హెచ్చరించింది. ఇరాన్ హెచ్చరికల నేపథ్యంలో హెర్మూజ్ మార్గంలో ఇతర దేశాలకు చెందిన 706 నౌకలు నిలిచిపోయినట్టు మారిటైమ్ అనలిటిక్ సంస్థలు విండ్‌వర్డ్, కెప్లెర్ అంచనా వేశాయి. ఇందులో 334 చమురు రవాణా నౌకలే ఉన్నట్టు పేర్కొన్నాయి. ప్రపంచ దేశాలు వాడే చమురులో ఐదోవంతు రవాణా హెర్మూజ్ నుంచే జరుగుతున్నది. ఇప్పుడు ఇరాన్ ప్రకటనతో 85 శాతానికి పైగా చమురు సరఫరాపై ప్రభావం పడినట్టు తెలుస్తున్నది. పరిస్థితి ఇలాగే కొనసాగితే, ఈ మార్గం నుంచి వచ్చే చమురు, ఎల్ఎన్‌జీని అత్యధికంగా వినియోగించే భారత్‌తో పాటు చైనా, దక్షిణ కొరియా, జపాన్ తదితర దేశాల్లో పెట్రోల్, గ్యాస్ ధరలు ఆకాశాన్ని అంటొచ్చని అంతర్జాతీయ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇదిలా ఉండగా భారత్‌కు సరఫరా అయ్యే 50 శాతం చమురు హెర్మూజ్ జలసంధి గుండానే వస్తుండటం గమనార్హం. దీంతో మన దేశంలో పెట్రోల్, గ్యాస్ ధరలు పెరగవచ్చునని ప్రచారం జరుగుతున్నది.

**డ్రోన్లతో విరుచుకుపడిన ఇరాన్**

ఖమేనీ మృతికి ప్రతీకారంగా సౌదీ అరేబియా రాజధాని రియాద్‌లోని అమెరికా ఎంబసీపై ఇరాన్ డ్రోన్లతో విరుచుకుపడింది. దీంతో ఆ ప్రాంతంలో మంటలు చెలరేగి, పెద్దయెత్తున పొగ వ్యాపించింది. మరోవైపు, బహ్రెయిన్‌లోని షేక్ ఇసా ప్రాంతంలో ఉన్న అమెరికా ఎయిర్‌బేస్‌ను కూడా డ్రోన్లు, క్షిపణులతో ధ్వంసం చేసినట్టు ఇరాన్ ప్రకటించింది. ఇంకోవైపు, యూఏఈలోని ఫుజైరా ఆయిల్ ఫీల్డ్‌పై ఇరాన్ డ్రోన్ దాడులు జరిపింది. కాగా.. ఇరాన్ దాడుల్లో యూఏఈలోని పలు భవనాలు ధ్వంసమయ్యాయి. దీంతో అక్కడి ప్రజలు తీవ్ర భయాందోళనలో ఉన్నారు. ఇరాన్ భీకర దాడుల నేపథ్యంలో ఇజ్రాయెల్‌లో హైఅలర్ట్ ప్రకటించారు. ఇజ్రాయెల్‌లో ఉన్న తమ పౌరులను ఉద్దేశించి జెరూసలేంలోని అమెరికా రాయబార కార్యాలయం కీలక విజ్ఞప్తి చేసింది. తదుపరి నోటీసులు వచ్చేవరకూ పౌరులందరూ ఎక్కడివారు అక్కడే ఉండాలని, అమెరికన్లను తరలించే లేదా సాయం చేసే పరిస్థితిలో ఎంబసీ లేదని పేర్కొంది. యూఏఈలోని తమ రెండు డేటా సెంటర్లపై డ్రోన్ దాడులు జరిగాయని అమెజాన్ ధ్రువీకరించింది. బహ్రెయిన్‌లోని ఓ డేటా సెంటర్ సమీపంలో దాడి జరిగిందని, దీంతో పాక్షికంగా నష్టం జరిగినట్టు వెల్లడించింది.

# పజలకు సంక్షేమ పథకాలు చేరవేయాలి

మొదటి తరువాయి

విద్యావ్యవస్థలో తీసుకువస్తున్న మార్పులపై ప్రజలకు అవగాహన కల్పించాలి. ప్రభుత్వ ఆస్పత్రులను మెడికల్ కాలేజీలతో అనుసంధానం చేయాలి. మధ్యాహ్న భోజనం ఏజెన్సీలకు ప్రతినెలా బిల్లులు చెల్లించాలని సీఎం అన్నారు. సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో అధికారులు, కలెక్టర్లకు పలు కీలక సూచనలు చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రాధాన్యత అంశాలు, పాలనాపరమైన సంస్కరణలపై ఈ సందర్భంగా చర్చించారు. ప్రజలకు పాలనను మరింత చేరువ చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు.మరోవైపు పలువురు కలెక్టర్లపై సీఎం సీరియస్ అయ్యారు. కొంత మంది కలెక్టర్లు జిల్లా హెడ్ క్వార్టర్ లో ఉండటం లేదన్నారు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉండి క్షేత్రస్థాయిలో అందుబాటులో లేకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో జాప్యం జరగకూడదని స్పష్టం చేశారు. అలాంటి వారు తమ పని తీరు మార్చుకోవాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. 99 రోజుల పాటు జిల్లా విడిచి వెళ్లొద్దని ఆదేశించారు. ఈ గడువులోగా నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని, నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ పాలనను పరుగులు పెట్టించాలని సీఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశం చేశారు. 99రోజుల పాటు జిల్లాను విడిచి వెళ్లొద్దని సీఎం ఆదేశించారు. రాజధాని శివారు జిల్లాల కలెక్టర్లు.. సీఎస్ కె.రామకృష్ణారావు అనుమతి లేకుండా హైదరాబాద్ వస్తున్నారన్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో వేగం పెంచే లక్ష్యంతో ఈ నెల 6 నుంచి జూన్ 12 వరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక పేరుతో 99 డేస్ యాక్షన్ ప్లాన్ అమలు చేయబోతోందన్నారు. జిల్లాల్లో బాగా పని చేసిన కలెక్టర్లకు సీఎం గ్రేడింగ్ ఇవ్వబోతున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో తాజా మీటింగ్‌లో పనితీరు ఆధారంగా కలెక్టర్లకు సీఎం గ్రేడింగ్ ఇవ్వనున్నారని ఆశించిన మేరకు పని తీరు చూపని కలెక్టర్లకు దిశానిర్దేశర చేయబోతున్నట్లు తెలుస్తోంది. ఈ సమావేశంలో పలువురు మంత్రులు, సీఎస్, ఉన్నతాధికారులు, కలెక్టర్లు పాల్గొన్నారు. ఈనెల 6 నుంచి జూన్ 12 వరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికను నిర్వహిస్తుంది. అయిదు దశల్లో 99 రోజుల పాటు జరిగే కార్యక్రమానికి నోడల్ శాఖ గా వ్యవహరిస్తున్న ప్రణాళిక శాఖ యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేసింది. ఏప్రిల్ 2న గ్రామ స్థాయిలో గ్రామ సభల నిర్వహణ ,ఏప్రిల్ 16న మండల స్థాయిలో , మే 2న నియోజకవర్గ స్థాయి , మే 22న జిల్లా స్థాయిలో కార్యక్రమాలు ఉంటాయని ఆ శాఖ వెల్లడించింది. జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ వేడుక నిర్వహించనున్నట్లు తెలిపింది. 10 వివిధ థీమ్‌లతో శాఖల వారీగా 99 రోజుల కార్యక్రమం ఉంటుందని వివరించింది. మొదటి థీమ్‌లో గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పరిసరాల పరిశుభ్రత, ప్రభుత్వ ఆఫీసుల్లో పెండింగ్ పైళ్ల క్లియరెన్స్ , రెండవ థీమ్‌లో ఆరోగ్యం 3లో అరైవ్.. అలైవ్, 4లో సంక్షేమం , 5లో పిల్లల భద్రత.. డ్రగ్స్ కు అడ్డుకట్ట, 6లో రైతు సంక్షేమం.. వ్యవసాయంపై కార్యక్రమాల నిర్వహణ ఉంటుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. 7లో విద్య, 8లో యువత.. క్రీడలు, 9లో మహిళలు , 10వ థీమ్‌లో పర్యావరణంపై సమావేశాలు జరుగుతాయని తెలిపారు. మార్చి 6న అన్ని ఉమ్మడి జిల్లాల్లో మంత్రుల ఆధ్వర్యంలో సన్నాహక సమావేశాలు , 99 రోజుల్లో శాఖల వారీగా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ కార్యక్రమాలుంటాయని వివరించింది. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమ పర్యవేక్షణకు ప్రత్యేక మొబైల్ యాప్‌ను తయారు చేశామని వెల్లడించింది .

# ఏజెన్సీ, చిత్తూరుల్లో ఏనుగుల సమస్య పరిష్కరించాం

మొదటి తరువాయి

వన్యప్రాణులు, మనుషుల మధ్య సంఘర్షణ తగ్గించేందుకే ఈ ప్రాజెక్టును చేపట్టామన్నారు. ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం సందర్భంగా మంగళగిరి ఏపీఎస్పీ బెటాలియన్ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి కందుల దుర్గేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మానవ - వన్యప్రాణుల సంఘర్షణను నివారించి, సహాయం అందించే 'హనుమాన్' ఫౌండేషన్ ప్రాజెక్టును డిప్యూటీ సీఎం ప్రారంభించారు. జీపీఎస్ ట్రాకింగ్ సిస్టమ్‌ను కూడా ఆవిష్కరించారు. అనంతరం ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర అటవీ శాఖ చరిత్రలో నేడు కీలకమైన రోజన్నారు. హనుమాన్ ప్రాజెక్టు ద్వారా మానవ - వన్యప్రాణి సంఘర్షణను తగ్గించడమే లక్ష్యమని చెప్పారు. వన్యప్రాణుల వల్ల పంట నష్టం, ప్రాణ నష్టం జరగకుండా ఈ ప్రాజెక్టు సహాయపడుతుందని తెలిపారు. ఏదైనా ఘటన జరిగిన వెంటనే స్పందించి సహాయ చర్యలు చేపట్టడం, పరిహారం అందించడం హనుమాన్ ఫౌండేషన్ బాధ్యత అని డిప్యూటీ సీఎం వివరించారు. ప్రాజెక్టులో 100 వాహనాలను అటవీ శాఖకు అందించామని పవన్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 19 అత్యవసర సహాయ బృందాలను సిద్ధం చేశామని పేర్కొన్నారు. ఏడు చోట్ల అత్యవసర చికిత్స, పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వన్యప్రాణుల దాడుల్లో గాయపడిన, మరణించిన వారికి 4 కోట్ల రూపాయల పరిహారం చెల్లించామన్నారు. మార్కెట్ విలువ ఆధారంగా పంట నష్ట పరిహారం ఇస్తున్నామని వెల్లడించారు. కర్ణాటక నుంచి కుంకీ ఏనుగులు తెచ్చి అడవి ఏనుగులను కట్టడి చేశామని ఉపముఖ్యమంత్రి చెప్పారు. వన్యప్రాణి సంరక్షణను బాధ్యతగా చేపట్టామని డిప్యూటీ సీఎం తెలిపారు. ఈ భూమిపై మనుషులతో పాటు జంతువులకూ స్థానం ఉందని ఆయన అన్నారు. హనుమాన్ ప్రాజెక్టును పకడ్బంధీగా రూపొందించిన అటవీ శాఖ అధికారులకు అభినందనలు తెలిపారు. ఈ ప్రాజెక్టులో స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యం కూడా తీసుకుంటామని పవన్ కళ్యాణ్ ప్రకటించారు. కార్యక్రమంలో అటవీ శాఖ ఏర్పాటు చేసిన వన్యప్రాణుల సంరక్షణ ప్రదర్శనను పవన్ తిలకించారు. అటవీ వన్యప్రాణి సంరక్షణలో పాలుపంచుకున్న అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వాలంటీర్లకు ప్రశంసా పత్రాలను అందజేశారు. హనుమాన్ ప్రాజెక్టు ద్వారా అటవీ శాఖకు రెస్క్యూ వాహనాలు, అంబులెన్సులను డిప్యూటీ సీఎం పవన్ అందజేశారు.

## పేదలకో న్యాయం.. పెద్దలకో న్యాయమా?

మొదటి తరువాయి

ఆందోళనలను విరమించాలని జాగృతి నేతలను కోరారు. దాంతో పోలీసులకు, ఆందోళనకారులకు మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. ఘటనా స్థలానికి హైడ్రా కమిషనర్ రంగనాథ్ రావాలని కవిత డిమాండ్ చేశారు. ఈ క్రమంలో ఆందోళన ఉధృతం కావడంతో కవితను పోలీసులు అరెస్టు చేసి నార్సింగి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కొద్దిసేపటి తర్వాత ఆమెను విడుదల చేశారు. ఈ సందర్భంగా కవిత మీడియాతో మాట్లాడుతూ.. మూసీకి ఆనుకుని ఉన్న పేదల భూములను హైడ్రా స్వాధీనం చేసుకుని, ఫెన్సింగ్ వేసి లగ్జరీ వ్యాపారస్తులతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే ప్రయత్నం చేస్తోందన్నారు. మూసీ సుందరీకరణ పేరుతో పేదల ఇండ్లను కూల్చడం దారుణమన్నారు. బండ్లగూడ సర్కిల్‌లోని గాంధీ సరోవర్ ప్రాజెక్టు పేరుతో మధు పార్క్ అపార్ట్‌మెంట్‌వాసుల ఇండ్లను కూల్చడం బాధాకరమని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఇక్కడ నిర్మాణాలకు అనుమతి ఇచ్చిందని, దాన్నే కాంగ్రెస్ కొనసాగిస్తోందని, పెద్దల పక్షాన్నే ప్రభుత్వాలు ఉన్నాయని చెప్పడానికి ఇదే నిదర్శనమని అన్నారు. పేదల ఇండ్లను కూల్చే హైడ్రాకు మూసీ పక్కనే నిర్మిస్తున్న అక్రమ వెంచర్లు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ఘటనా స్థలానికి హైడ్రా కమిషనర్ రంగనాథ్ బుల్డోజర్లతో రావాలని డిమాండ్ చేశారు. ఆదివారం కోర్టులకు సెలవులు ఉన్న రోజున హైడ్రా కమిషనర్ ఆధ్వర్యంలో పేదల ఇండ్లపైకి బుల్డోజర్లు పంపించడం దారుణమన్నారు. హైదరాబాద్ శివారుల్లో పేదల ఇండ్లను కూల్చేసినందుకు ఈ ప్రభుత్వం తప్పకుండా మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. గాంధీ విగ్రహం కోసం రూ.5వేల కోట్ల అప్పు చేయాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. ప్రాజెక్టుకు సంబంధించి డీపీఆర్ పెట్టక ముందే చుట్టుపక్కల ఉన్న ఇండ్లను కూలగొట్టడం సమంజసం కాదన్నారు. ఇతర నిర్మాణాలకు మూసీ ఒడ్డు నుంచి 30 మీటర్ల దూరం ఉండాలనే నిబంధనలు విధిస్తున్న ప్రభుత్వం, కొందరు పెద్దల భవనాలు 5 మీటర్ల దూరంలోనే ఉన్నా అనుమతులు ఇస్తున్నారంటే ఎంతటి అక్రమాలు జరుగుతున్నాయో తేలిపోతున్నదని ఆరోపించారు.

## చర్చలకు సిద్ధమన్న ఇరాన్

మొదటి తరువాయి

మీడియా వేదిక ట్రూత్ సోషల్‌లో పోస్టు చేశారు. వాల్‌స్ట్రీట్ జర్నల్‌లో వచ్చిన ఓ కథనాన్ని ట్రంప్ ఖండించారు. ఆ పత్రిక అభిప్రాయంతో ఏకీభవించడం లేదన్నారు. అమెరికా ఆయుధ నిల్వలు తక్కువగా ఉన్నాయని, ఎక్కువ కాలం యుద్ధం కొనసాగితే అవి నిండుకునే ప్రమాదం ఉందన్న వార్తలను అధ్యక్షుడు తోసిపుచ్చారు. మధ్యస్థ, ఉన్నతస్థాయి ఆయుధాలు అపరిమిత సంఖ్యలో ఉన్నాయని, అవి చాలా శక్తిమంతమైనవన్నారు. ఇరాన్‌తో ఘర్షణల నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. తమవద్ద లెక్కలేనన్ని ఆయుధాలు ఉన్నాయని పోస్టు పెట్టారు. విజయవంతంగా ఎప్పటికీ యుద్ధం చేస్తూనే ఉండగలమని రాసుకొచ్చారు. అమెరికా కోసం ఉన్నతశ్రేణి ఆయుధాలను ఇతర దేశాల్లో కూడా నిల్వ చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా మాజీ అధ్యక్షుడు జో బైడెన్‌పై విమర్శలు గుప్పించారు. ఆయన ఆయుధాల నిల్వలను సరిగా నిర్వహించలేదని, ఉక్రెయిన్‌కు భారీఎత్తున అధునాతన ఆయుధాలను పంపారని విమర్శించారు. ‘అదృష్టవశాత్తూ నా తొలివిడత పాలనలోనే మిలిటరీని మెరుగుపర్చాను. అమెరికా వద్ద నిల్వలు భారీ విజయాలు సాధించేంతగా ఉన్నాయి‘ అని తన పోస్టులో పేర్కొన్నారు. ఇదిలాఉంటే.. ఇరాన్‌పై దాడుల గురించి కాంగ్రెస్ (అమెరికా చట్టసభలు)కు ట్రంప్ అధికారికంగా వెల్లడించారని స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. దేశ ప్రజల ప్రయోజనాల కోసమే ఈ చర్యలు తీసుకున్నట్లు అధ్యక్షుడు సమర్థించుకున్నారు. అలాగే రానున్న 24 గంటల్లో ఇరాన్‌పై భీకర దాడులు చేయనున్నట్లు ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు. తాము ఇప్పటివరకు పెద్ద దాడులే చేయలేదని వ్యాఖ్యలు చేయడం ఆందోళన రేకెత్తిస్తోంది.

## పేదలకు వరం సీఎం సహాయనిధి

-సర్పంచ్ సుగుణ సంపత్



**ఇబ్రహీంపట్నం, మార్చి 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరంలాంటిదని సర్పంచ్ ముచ్చర్ల సుగుణ సంపత్ అన్నారు. యాచారం మండల మేడిపల్లి నక్కర్త గ్రామానికి చెందిన ఎర్కలి నర్సింహకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.48 వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తోంది. విద్య, వైద్యం రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తోంది. ప్రజలు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి" అని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎర్కలి బాల్‌రాజ్ గౌడ్, మాజీ ఎంపిటిసి మోటే శ్రీశైలం, ఉప సర్పంచ్ దేంది మధుకర్ రెడ్డి, వార్డ్ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## దేవాలయ భూముల ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి



**మనోహరాబాద్, మార్చి 3(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మనోహరాబాద్ మండలంలో దేవాదాయ శాఖకు చెందిన మూడు ఎకరాల భూమిని ప్రైవేటు వ్యక్తులు అధికారులతో కలిసి అక్రమంగా తమ పేర్లకు మార్చుకొని వెంచర్ నిర్మాణం చేపడుతున్నారని న్యాయవాది కారుపోతుల రేవంత్, న్యాయ విద్యార్థి చెలిమెల మణివర్ధన్ ఆరోపించారు.

వారు దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖను కలిసి భూమిని కాపాడాలని, నిబంధనలు ఉల్లంఘించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని వినతి చేశారు. మంత్రి సానుకూలంగా స్పందించి నివేదిక తెప్పించి తగు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. "అధికారులు, స్థానిక నాయకులు దేవాలయ భూమిని కాపాడి అక్కడ ఆలయం నిర్మించాలి. లేనిపక్షంలో న్యాయపోరాటానికి సిద్ధం" అని వారు స్పష్టం చేశారు.

## ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేసిన కమిషనర్



**షాద్‌నగర్, మార్చి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ కమ్యూనిటీ ప్రభుత్వ ఆసుపత్రిని వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్ సోమవారం తనిఖీ చేశారు. రోగుల వార్డులను పరిశీలించి, వారికి అందుతున్న వైద్య సేవలపై వివరాలు తెలుసుకున్నారు. పోస్టుమార్టం గది సహా ఆసుపత్రి విభాగాలను పరిశీలించిన ఆయన, వైద్య సిబ్బంది నిర్లక్ష్యం లేకుండా ఎప్పటికప్పుడు సేవలు అందించాలని సూచించారు.

## మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ మాతృమూర్తి మంగమ్మ మృతి నివాళులర్పించిన ప్రముఖులు



**వెల్దండ, మార్చి 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ మాతృమూర్తి గుర్కా మంగమ్మ మృతి చెందారు. ఈ విషయం తెలిసిన ప్రముఖులు ఆమె స్వగ్రామం కడ్తాల మండలంలోని చెల్లంపల్లి గ్రామ పంచాయతీకి చేరుకుని మృతదేహానికి నివాళులర్పించారు. రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ చైర్మన్ ఉప్పల వెంకటేష్ ,మాజీ సింగిల్ విండో చైర్మన్ జూపల్లి భాస్కర్‌రావు, మాజీ ఎంపీపీ నిర్మల, జోగు వీరయ్య తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఇక "వికసిత్ భారత్ గ్యారంటీ" దిశగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం




గ్రామీణ భారత ఆర్థిక వ్యవస్థకు ప్రాణాధారంగా నిలిచిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కొత్త రూపాన్ని సంతరించుకుంటోంది. "వికసిత్ భారత్ 2047" లక్ష్యాన్ని దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన లి"వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజగార్ అండ్ అజీవిక మిషన్ (గ్రామీణ) బిల్లు ‒ ‒ 2025"లికు డిసెంబర్ 21న రాష్ట్రపతి ఆమోదముద్ర వేశారు. ఫిబ్రవరి నాటికి అన్ని రాష్ట్రాల్లో అవగాహన కార్యక్రమాలు పూర్తి చేసి, ఏప్రిల్ 1 నుండి అమలులోకి తీసుకురానున్నారు. గ్రామీణ కూలీలకు ఉపాధి భద్రతను మరింత బలపరుస్తూ, ఈ పథకంలో పని దినాలను 100 రోజుల నుంచి 125 రోజులకు పెంచడం ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది. అదే సమయంలో వ్యవసాయ రంగంలో కూలీల కొరత తలెత్తకుండా పంటల విత్తన, నాటే కాలంలో 60 రోజులపాటు పనులను నిలిపివేసి వ్యవసాయానికి ప్రాధాన్యం ఇవ్వడం వంటి సమతుల్య విధానాన్ని అనుసరించడం గమనార్హం. పనుల ప్రణాళిక, అమలు, పర్యవేక్షణ అన్నీ గ్రామ పంచాయతీల ద్వారానే జరిగేలా చేయడం ద్వారా స్థానిక స్వయం పాలనకు మరింత బలం చేకూర్చే ప్రయత్నం కనిపిస్తోంది.

**ఈ పథకం నాలుగు ప్రధాన విభాగాలపై ఆధారపడి ఉంటుంది---జల సంరక్షణ, గ్రామీణ మౌలిక వసతులు, జీవనోపాధి అభివృద్ధి, విపత్తుల నిర్వహణ.**

జల సంరక్షణ విభాగంలో చెరువులు, కుంటలు, జలాశయాల పునరుద్ధరణకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. వాటర్‌షెడ్ అభివృద్ధి, చెక్‌డ్యామ్‌ల నిర్మాణం, వర్షపు నీటి నిల్వ చర్యలు, బావుల తవ్వకం, సామాజిక భూముల పునరుద్ధరణ, అటవీ విస్తరణ వంటి కార్యక్రమాలు గ్రామీణ నీటి భద్రతకు బలాన్నిస్తాయి. గ్రామీణ మౌలిక వసతుల పరంగా పారిశుధ్య సముదాయాల నిర్మాణం, తడి--పొడి చెత్త నిర్వహణ, పంచాయతీ భవనాలు, గ్రామ గ్రంథాలయాలు, శ్మశాన వాటికలు ఏర్పాటు చేయనున్నారు. విద్యా రంగంలో పాఠశాలలలో కిచెన్ గదులు, అదనపు తరగతి గదులు, ప్రహరీ గోడలు, అంగన్వాడీ కేంద్రాలు, క్రీడా మైదానాల వసతులు కల్పించడం ద్వారా గ్రామీణ విద్యకు మౌలిక బలం అందించనున్నారు. ఇళ్ల నిర్మాణంలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద చేపట్టే పనులు, తాగునీటి వసతుల కోసం జల్ జీవన్ మిషన్ కింద పనులను సమన్వయం చేయడం ద్వారా సమగ్ర గ్రామాభివృద్ధి సాధ్యమవుతుంది. జీవనోపాధి విభాగంలో వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ కేంద్రాలు, గోదాములు, కోల్డ్ స్టోరేజీలు నిర్మించడం ద్వారా రైతులకు గిట్టుబాటు ధర వచ్చినప్పుడు విక్రయించే అవకాశం కల్పించనున్నారు. పశుసంవర్ధక రంగంలో పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్ల పెంపకానికి గడ్డి మైదానాలు, అవసరమైన వసతులు కల్పించనున్నారు. చేపల పెంపకానికి యార్డులు ఏర్పాటు చేయడం, గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాల కోసం నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు స్థాపించడం కూడా లక్ష్యంగా పెట్టుకున్నారు. మహిళా స్వయం సహాయక సంఘాలకు ప్రత్యేక భవనాలు నిర్మించడం ద్వారా ఆర్థిక సాధికారతకు మరింత బలం చేకూర్చనున్నారు. విపత్తుల నిర్వహణలో తుఫాను, వరదల నుంచి రక్షణకు శెల్టర్లు, వరద మళ్లింపు కాలువలు నిర్మించడం, అగ్ని ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టడం ద్వారా గ్రామీణ భద్రతకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈ సమగ్ర పథకానికి 2026--27 ఆర్థిక సంవత్సరానికి రూ.95,692 కోట్ల భారీ కేటాయింపును కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. సాధారణ రాష్ట్రాలకు 60:40 నిష్పత్తిలో, ఈశాన్య రాష్ట్రాలకు 90:10 నిష్పత్తిలో నిధుల పంపకం జరుగనుంది. సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సాధించాలంటే కేవలం నిధుల కేటాయింపు సరిపోదు; సమర్థవంతమైన అమలు, పారదర్శకత, సామాజిక భాగస్వామ్యం అవసరం. "వికసిత్ భారత్ 2047" స్వప్నాన్ని సాకారం చేయాలంటే గ్రామీణాభివృద్ధి బాటలో కేంద్ర--రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో ముందుకు సాగాలి. గ్రామం బలపడితేనే దేశం బలపడుతుంది---ఈ సూత్రాన్ని కార్యరూపంలో చూపించాల్సిన సమయం ఇదే.


### వ్యాసకర్త

గోరుపాటి శంకర్


ఎమ్ ఎ (తెలుగు) ఉస్మానియా యూనివర్సిటీ అండ్ ఎం సి జే

రచయిత అండ్ జర్నలిస్ట్

చరవాణి:8179885282




## బుగ్గ అటవీ ప్రాంతంలో ఘనంగా ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం






**పాలకుర్తి, మార్చి 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రపంచ వన్యప్రాణి దినోత్సవం సందర్భంగా పెదపల్లి అటవీ రేంజ్ పరిధిలోని ఈశాల తక్కల్లపల్లి శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయం సమీపంలోని కంపార్ట్మెంట్ నం. 707లో మంగళవారం ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ, శుభ్రత కార్యక్రమం నిర్వహించారు. పెదపల్లి జిల్లా అటవీ అధికారి సూచన మేరకు రేంజ్ అధికారి సతీష్ కుమార్ ఆధ్వర్యంలో రేంజ్ సిబ్బంది ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. బుగ్గ దేవాలయం ఆధ్యాత్మిక పర్యాటక క్షేత్రం కావడంతో భక్తుల రద్దీ కారణంగా భారీగా చెత్త పేరుకుపోయింది. అటవీ ప్రాంతంలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అటవీ పరిరక్షణే లక్ష్యమని, అడవుల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు వన్యప్రాణులకు హానికరమని అధికారులు హెచ్చరించారు. ప్రజల్లో అడవి జంతువుల సంరక్షణపై చైతన్యం కల్పించడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారులు దేవదాస్, స్వాతి, కొమురయ్య, ఫారెస్ట్ సెక్షన్ అధికారులు మంగిలాల్, సతీష్, వాయుకుమార్, బీట్ అధికారులు మేఘరాజ్, వరప్రసాద్, శ్రావంతి, అక్తర్, జూనియర్ అసిస్టెంట్లు, డీఈఓలు, వాచర్లు పాల్గొన్నారు.


## నికిత కుటుంబానికి ఇచ్చిన హామీలు ఎప్పుడు అమలు చేస్తారు

ఎడెల్లి ఆంజనేయులు మాదిగ



**అచ్చంపేట, మార్చి 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలంలోని మన్ననూరు గురుకుల పాఠశాలలో విద్యార్థిని నికిత ఆత్మహత్య ఘటనపై ఇప్పటికీ ప్రజల్లో ఆందోళన కొనసాగుతోంది. ఈ సందర్భంగా ఎంఆర్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు ఎడెల్లి ఆంజనేయులు మాదిగ మాట్లాడుతూ, ప్రస్తుత అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ బాధిత కుటుంబానికి ఒక ప్రభుత్వ ఉద్యోగం, ఇల్లు ఇస్తామని హామీ ఇచ్చిన విషయం అందరికీ తెలిసిందే. అయితే ఇప్పటి వరకు ఆ హామీ అమలుపై ఎటువంటి స్పష్టమైన చర్యలు కనిపించకపోవడం పట్ల ప్రజల్లో అసంతృప్తి నెలకొన్నదని తెలిపారు. బాధిత కుటుంబం మాదిగ సామాజిక వర్గానికి చెందినదని గుర్తుచేస్తూ, ఇలాంటి సందర్భాల్లో సామాజిక న్యాయం, సమానత్వం, మానవత్వం ప్రధానంగా నిలవాలని ఆయన అన్నారు. ప్రజాప్రతినిధులు కుల, వర్గ భేదాలకు అతీతంగా స్పందించి ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని సూచించారు. కాబట్టి బాధిత కుటుంబానికి ప్రకటించిన ప్రభుత్వ ఉద్యోగం, ఇల్లు తక్షణమే మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# ఆకాశాన్ని చూస్తున్న చిన్నారి... గ్రహణాన్ని అర్థం చేసుకుంటున్న కొత్త తరం



భూమి నీడలో చంద్రుడు ఖగోళ దృశ్యం


టెలిస్కోప్‌తో ఆకాశాన్ని వీక్షిస్తున్న చిన్నారి గ్రహణం విజ్ఞాన పాఠం

## భయం కాదు-విజ్ఞానం నేర్చుకునే అవకాశమే చంద్రగ్రహణం

ఆకాశంలో కనిపించే ప్రతి సహజ సంఘటన వెనుక ఒక శాస్త్రీయ కారణం ఉంటుంది. చంద్రగ్రహణం కూడా అలాంటి ఖగోళ అద్భుతమే. భూమి, సూర్యుడు, చంద్రుడు ఒకే సరళరేఖలో వచ్చినప్పుడు భూమి నీడ చంద్రుడిపై పడటంతో ఈ సంఘటన ఏర్పడుతుంది. ఇది సహజ ప్రక్రియ మాత్రమే గానీ అపశకునం కాదు. చిన్నారులు ఆసక్తిగా ఆకాశాన్ని వీక్షిస్తూ ప్రశ్నలు అడగడం సమాజంలో పెరుగుతున్న శాస్త్రీయ దృక్పథానికి సంకేతంగా భావించవచ్చు.

గ్రహణం వంటి సంఘటనలను భయంతో కాకుండా విజ్ఞాన దృష్టితో చూడాల్సిన అవసరం ఉంది. మన సంస్కృతి,సాంప్రదాయాలు కాలక్రమేణా ఏర్పడ్డ నమ్మకాలు. పెద్దలు మంచి జరగాలని, చెడు దూరంగా ఉండాలని కొన్ని నియమాలు సూచించారు. ఆ ఉద్దేశాన్ని గౌరవించాలి. అయితే శాస్త్రం స్పష్టంగా చెప్పిన విషయాలను విస్మరించి అపోహలను ప్రోత్సహించడం సమాజానికి మేలు చేయదు. నేటి తరానికి భయం కాకుండా బుద్ధిని నేర్పాలి. ఆకాశాన్ని చూసి ప్రశ్నించడం, పరిశీలించడం, అర్థం చేసుకోవడం నేర్పితేనే విజ్ఞాన సమాజం నిర్మాణం సాధ్యమవుతుంది. చంద్రగ్రహణం వంటి సందర్భాలు విద్యార్థుల్లో శాస్త్రీయ చైతన్యాన్ని పెంపొందించేందుకు మంచి అవకాశాలుగా భావించవచ్చు.

**భయం కాదు... బుద్ధి అవసరం.**
**అపోహలు కాదు... అవగాహన అవసరం.**


**గంగవరం రామకృష్ణారెడ్డి**

------------------------------



# మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ కి మాతృవియోగం

### నివాళులు అర్పించిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, పలువురు బిఆర్ఎస్ నాయకులు





**కడ్తాల్, మార్చి 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రంగారెడ్డి జిల్లా కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్క జైపాల్ యాదవ్ మాతృమూర్తి గుర్క మంగమ్మ అనారోగ్యంతో మంగళవారం తెల్లవారుజామున మృతి చెందింది. ఆమె మృతి పట్ల నియోజకవర్గ పలు పార్టీల నాయకులు, కుటుంబ సభ్యులు దిగ్భ్రాంతికి గురి చెందారు. స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, బిఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు ఆర్ ఎస్ ప్రవీణ్, మాజీ ఎంపీ రాములు, షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి, బిఆర్ ఎస్ నేత ఉప్పల వెంకటేష్, పోలీషన్ బోర్డు మెంబర్ బాలాజీ సింగ్, పిసిసి సభ్యులు శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎమ్మెల్సీ ఎగ్గే మల్లేశం, సర్పంచుల సంఘము రాష్ట్ర మాజీ అధ్యక్షులు గూడూరు లక్ష్మీ నర్సింహా రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా, డిసిసి అధికార ప్రతినిధి శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర్ రెడ్డి, సింగల్ విండో చైర్మన్ వెంకటేష్ గుప్తా, వివిధ గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, వివిధ పార్టీల నాయకులు తదితరులు నివాళి అర్పించారు.స్వగ్రామం కడ్తాల్ మండలం చల్లంపల్లిలో అంతక్రియలు నిర్వహించారు.

# మైసిగండి మైసమ్మ ఆలయం మూసివేత



**కడ్తాల్, మార్చి 03 ( నీలగిరి ఎక్స్ ప్రేస్ )**
చంద్రగ్రహణం పురస్కరించుకునిమంగళవారం మైసిగండి మైసమ్మ ఆలయాన్ని మూసి వేశారు.ఈవో స్నేహలత, ట్రస్టీ శిరోలి మాట్లాడుతూ ఉదయం 7 గంటలకు ఆలయాన్ని మూసివేసి గ్రహణం వీడిన అనంతరం 4వ తేదీ ఉదయం 6 గంటలకు ప్రత్యేక పూజలు, అభిషేకం, అలంకరణ తర్వాత యథావిధిగా భక్తుల దర్శనానికి అనుమతి ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.

# ఘనంగా హోళీ సంబురాలు



**దేవరకొండ మార్చి 03 (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
నల్లగొండ జిల్లా డిండి మండలం గోనబోయినపల్లి గ్రామంలో సర్పంచ్ వర్కాల బాల నారాయణ ఆధ్వర్యంలో హోళీ పండుగను ఘనంగా నిర్వహించారు.సోమవారం రాత్రి కామధాహానం నిర్వహించారు.మంగళవారం నాడు రంగులు జల్లుకొని ఊరంతా ఉత్సాహంగా సంబరాలు చేసుకున్నారు.ఈకార్యక్రమంలో సర్పంచ్ వర్కాల బాల నారాయణ ,ఉప సర్పంచ్ బద్దెల బాల లింగయ్య, వార్డు సభ్యులు వరికుప్పల రవి, అంజి, దామోదర్,వసంత శ్రీశైలం, గ్రామస్తులు ఇమ్మడి చెన్నయ్య, దొడ్డి ఆంజనేయులు, కిన్నెర సిద్ధు, కిన్నెర శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# ఎలిగేడు లో ఘనంగా హోలీ సంబరాలు

**ఎలిగేడు, మార్చి 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మండలంలోని అన్ని గ్రామాల్లో మంగళవారం హోలీ పండుగను ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. చిన్నా--పెద్దా తేడా లేకుండా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ సంతోషంగా గడిపారు.ఎలిగేడు మండల కేంద్రంలో సర్పంచ్ కప్పల ప్రవీణ్ ఆధ్వర్యంలో హోలీ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల సర్పంచులు, వార్డు సభ్యులు, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.




ఎలిగేడు లో గ్రామస్తులతో కలసి హోలీ సంబరాలు జరుపుకున్న సర్పంచ్ కప్పల ప్రవీణ్.

# హోలీ సంబరాల్లో యువత ఉత్సాహం



**వెల్దండ, మార్చి 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మండల కేంద్రంలో మంగళవారం హోలీ పండుగను పిల్లలు, మహిళలు, యువత ఆనందంగా జరుపుకున్నారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ సాంప్రదాయ ఉత్సాహంతో వేడుకల్లో పాల్గొన్నారు."హోలీ పండుగ వసంత ఋతువులో పాల్గుణ పౌర్ణమి రోజున వస్తుంది. ఇది ప్రేమ, సంతోషానికి ప్రతీక. చెడుపై మంచికి విజయాన్ని సూచిస్తుంది" అని జంగిలి యాదగిరి తెలిపారు.

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు చేపట్టాలి

### - ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**సిద్దిపేట, మార్చి 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
సిద్దిపేటలో జరిగిన కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.నిజమైన అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. గ్రామ సభల్లో సంక్షేమ పథకాల వారీగా ప్రభుత్వం అందిస్తున్న లబ్ధిని ప్రజలకు వివరించాలని, రేషన్ కార్డులు, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇండ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పథకాల లబ్ధిదారుల అభిప్రాయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు.విద్యా వ్యవస్థలో ప్రభుత్వం తీసుకువస్తున్న మార్పులపై ప్రజలకు అవగాహన కల్పించాలని, ప్రభుత్వ ఆసుపత్రులను సమీపంలోని మెడికల్ కాలేజీలకు అనుసంధానం చేసి ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. మధ్యాహ్న భోజనం ఏజెన్సీలకు ప్రతి నెలా బిల్లుల చెల్లింపులు కచ్చితంగా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.99 డేస్ ప్రోగ్రామ్‌లో గ్రామ స్థాయి నుంచి జిల్లా వరకు ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం ఉండాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ కే. హేమావతి పాల్గొన్నారు.

# నారా భువనేశ్వరిని కలిసిన యాదిలాల్



**ఆమనగల్లు, మార్చి 3(నీలగిరి ఎక్స్ ప్రెస్) :**
టిడిపి రాష్ట్ర నాయకుడు, ఆమనగల్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అండే కార్ యాదిలాల్ మంగళవారం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి నీ మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్ ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్ లో కలిసి ఇటీవల అవార్డు అందుకున్న ఆమెను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. కల్వకుర్తి నియోజకవర్గంలో పార్టీ పరంగా చేపడుతున్న సేవా కార్యక్రమాలను భువనేశ్వరి కి వివరించినట్లు యాదిలాల్ పేర్కొన్నారు.

# ఘనంగా హోలీ ఉత్సవాలు



**ఆమనగల్లు, మార్చి 3(నీలగిరి ఎక్స్ ప్రెస్) :**
ఆమనగల్లు మున్సిపాలిటీలో మంగళవారం ఉత్సవాలు ఘనంగా జరుపుకున్నారు. ఈ హోలీ ఉత్సవాలలో జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు ఆచారి పాల్గొని హోలీ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఒకరిపై ఒకరు రంగులు పూసుకుని హోలీ వేడుకను జరుపుకున్నారు. యువకులు, చిన్న పెద్ద తేడా లేకుండా ప్రతి ఒక్కరూ హోలీ ఉత్సవాలలో పాల్గొని, శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ముక్తలా వెంకటయ్య, ఎర్రవోలు మహేష్, గోరటి నరసింహ, సిరి, టిల్లు యాదవ్, వడ్డె రాజు తదితరులు పాల్గొన్నారు.

# హోలీ వేడుకను ఘనంగా జరుపుకున్న మహిళలు



**ఆమనగల్లు, మార్చి 3(నీలగిరి ఎక్స్ ప్రెస్) :**
ఆమనగల్లు పట్టణ కేంద్రంలోని మహిళలు హోలీ పండుగను ఘనంగా జరుపుకున్నారు. మహిళలు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకొని హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. హోలీ పండుగ అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. పట్టణ మొత్తం పండుగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో మహిళలు చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చంద్రగ్రహణంతో ఆలయాల మూసివేత



చంద్రగ్రహణం సందర్భంగా ఎలిగేడు మండల కేంద్రంలోని భవాని రామలింగేశ్వర ఆలయం మూసివేత.

**ఎలిగేడు, మార్చి 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల ఆలయాలను మంగళవారం చంద్రగ్రహణం కారణంగా మూసివేశారు. గ్రహణం అనంతరం ఆలయాలను శుద్ధి చేసి తిరిగి తెరవనున్నట్లు భవాని రామలింగేశ్వర ఆలయ ప్రధాన అర్చకుడు సెగ్యామ దయాకర్ శర్మ తెలిపారు.

# గ్రామాల్లో కాముని దహనం



దూళికట్టలో కాముని దహనం చేస్తున్న గ్రామస్తులు.

**ఎలిగేడు, మార్చి 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మండలంలోని అన్ని గ్రామాల్లో మంగళవారం తెల్లవారుజామున కాముని దహనం ఘనంగా నిర్వహించారు. హోలీ పండుగకు ముందు చెడుపై మంచి సాధించిన విజయానికి సంకేతంగా కాముని దహనం చేస్తారని గ్రామ పెద్దలు తెలిపారు.

# బోడుప్పల్‌లో ఘనంగా హోలీ వేడుకలు



**బోడుప్పల్, మార్చి 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
గ్రేటర్ బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 13వ డివిజన్ రాజీవ్‌నగర్ కాలనీలో డబుల్ బెడ్‌రూమ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం హోలీ పండుగ వేడుకలు ఘనంగా జరిగాయి. చిన్నా--పెద్దా తేడా లేకుండా ప్రజలు రంగులు చల్లుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దానగాళ్ల యాదగిరి హాజరై, "హోలీ పండుగ కులమతాలకు అతీతంగా జరుపుకుంటారు. ఈ రంగులు మీ జీవితాలను ఆనందమయం చేయాలి" అని ఆకాంక్షించారు. ఈ వేడుకలో డివిజన్ అధ్యక్షుడు గోపు రాములు, కాలనీ ఉపాధ్యక్షుడు నానాజీ, అసోసియేషన్ అధ్యక్షుడు చిప్పల శ్రీధర్, కార్యదర్శి తుక్కోజీ అమరేందర్, కోశాధికారి రాజగోపాల్ నాయుడు, సలహాదారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# వైద్య సేవలలో దూసుకుపోతున్న పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి

**పెద్దపల్లి, మార్చి 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఇంతకు ముందు నేను రాను బిడ్డో సర్కార్ దవాఖానకు అనే నానుడి ఉండేది. కానీ రోజులు మారాయి. ఇప్పుడు మేము వస్తాము సర్కార్ దవాఖానకు అని పెద్దపల్లి జిల్లా ప్రజలు చెబుతున్నారు. ఈ మార్పుకు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణ రావు సహకారం, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. శ్రీధర్ నిరంతర పర్యవేక్షణ ప్రధాన కారణమని అధికారులు పేర్కొన్నారు. ఫిబ్రవరి నెలలో ఆసుపత్రి అందించిన వైద్య సేవల వివరాలు విశేషంగా ఉన్నాయి. మొత్తం 22,447 మంది ఔట్‌పేషెంట్లు చికిత్స పొందగా, వీరిలో జనరల్ మెడిసిన్ విభాగంలో 9,758 మంది, చిన్నపిల్లల విభాగంలో 4,263 మంది, గైనిక్ విభాగంలో 3,364 మంది, కంటి విభాగంలో 1,509 మంది, ఈఎన్‌టి విభాగంలో 675 మంది, చర్మ విభాగంలో 1,039 మంది, దంత విభాగంలో 574 మంది సేవలు పొందారు. అదేవిధంగా 1,872 మంది ఇన్‌పేషెంట్లు చేరగా, వీరిలో జనరల్ మెడిసిన్‌లో 849 మంది, పిల్లల విభాగంలో 433 మంది, గైనిక్‌లో 273 మంది,



కంటి విభాగంలో 174 మంది చికిత్స పొందారు. శస్త్రచికిత్సలలో కూడా ఆసుపత్రి విశేష ఫలితాలు సాధించింది. 54 ఆర్థో, 81 జనరల్ సర్జరీ, 164 కంటి, 25 ఈఎన్‌టి, 409 డెంటల్ శస్త్రచికిత్సలు నిర్వహించారు. గడిచిన నెలలో 184 డెలివరీలు జరిగాయి. అదనంగా 27,859 ల్యాబ్ టెస్టులు, 2,062 అల్ట్రాసౌండ్ స్కానింగ్, 133 టిఫ్ఫా స్కానింగ్, 722 ఈసీజీ, 255 2డి ఎకో, 1,880 ఎక్స్‌రే, 724 ఫిజియోథెరపీ సేవలు అందించారు. నవజాత శిశువులకు ఇప్పటి వరకు దాదాపు 700 మందికి చికిత్స అందించారు. ఆరోగ్యశ్రీ ద్వారా 308 సేవలు అందించారు. ప్రత్యేకంగా 8 లాప్రోస్కోపిక్, 1 యూరాలజీ, 9 రూట్ కెనాల్ శస్త్రచికిత్సలు కూడా నిర్వహించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. శ్రీధర్ మాట్లాడుతూ, పెద్దపల్లి ప్రజలు అందిస్తున్న అన్ని రకాల వైద్య సేవలను వినియోగించుకోవాలని, ఏదైనా ఇబ్బందులు ఎదురైతే నేరుగా తనను సంప్రదించవచ్చని తెలిపారు. పేషెంట్ సేవలపై సూచనలు, సలహాలు ఇవ్వడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉంటానని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# జిల్లా అధికారుల ఆధ్వర్యంలో కలెక్టర్ పమేలా సత్పతికి ఘన సన్మానం



**కరీంనగర్, మార్చి 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ పూర్వ కలెక్టర్ పమేలా సత్పతికి జిల్లా అధికారుల ఆధ్వర్యంలో జింకల పార్కులో ఆత్మీయ వీడ్కోలు సమావేశం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పమేలా సత్పతి మాట్లాడుతూ, కరీంనగర్ జిల్లా కలెక్టర్గా పనిచేయడం గొప్ప అవకాశం. కన్న ఊరు కోరాపూట్ తర్వాత కరీంనగర్ జిల్లా ప్రజలు అక్కున చేర్చుకోవడం జీవితంలో మర్చిపోలేనిది. అధికారుల సహకారంతోనే జిల్లా సమగ్ర అభివృద్ధికి కృషి చేశాను" అని భావోద్వేగంగా పేర్కొన్నారు. రెండు సంవత్సరాల నాలుగు నెలలపాటు కలెక్టర్గా పనిచేసిన అనుభవాన్ని గుర్తుచేసుకుంటూ, జిల్లా ఎంతో నేర్పిందని, ప్రజల ప్రాణాలు కూడా విలువైనవేనని, ఎల్లవేళలా కరీంనగర్‌ను మరిచిపోలేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపి గౌష్ ఆలం, అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మీకిరణ్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డీవోలు కే. మహేశ్వర్, రమేష్ బాబు, అన్ని విభాగాల అధికారులు, టీఎన్జీవో, టీజీవో సంఘాల ప్రతినిధులు, ఎంపీడీవోలు, తహసీల్దారులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీతో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కుటుంబ సభ్యులు




**కరీంనగర్, మార్చి 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
వికారాబాద్‌లో గత పది రోజులుగా కొనసాగిన సంఘటన్ సృజన్ అభియాన్ శిక్షణ శిబిరాల ముగింపు సమావేశానికి లోక్‌సభ ప్రతిపక్ష నేత, జాతీయ కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ హాజరయ్యారు. గ్రామస్థాయి నుండి పార్టీ బలోపేతం, కార్యక్రమాల నిర్వహణపై జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. నేటి చివరి రోజు జరిగిన ముగింపు సమావేశంలో జిల్లా నేతల కుటుంబ సభ్యులతో ఆత్మీయంగా కలిసిన రాహుల్ గాంధీ, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కుటుంబ సభ్యులతో కలిసి ఫోటో దిగారు. ఈ సందర్భంగా ఆయన మేడిపల్లి సత్యం కుమార్తె, కుమారునితో ముచ్చటించి ఆత్మీయతను ప్రదర్శించారు.

# ఆహ్లాదకరంగా హోలీ సంబరాలు




**పెద్దపల్లి, మార్చి 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పెద్దపల్లి పట్టణంలోని జూనియర్ కాలేజ్ గ్రౌండ్‌లో కలసి ఉంటే కలదు సుఖం అనే నినాదంతో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తిర్రి తిరుపతి గౌడ్ ఆధ్వర్యంలో హోలీ సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జాతీయ బీసీ సంక్షేమ సంఘం నేషనల్ కోఆర్డినేటర్ ఆకుల స్వామి వివేక్ పటేల్ మాట్లాడుతూ హోలీ పండుగ శాంతి, సౌభ్రాతృత్వానికి ప్రతీక అని, అన్ని వర్గాల ప్రజలను ఏకం చేసే రంగుల పండుగగా హోలీ నిలుస్తుందని అన్నారు. ప్రజల జీవితాలు సప్తవర్ణ శోభితం కావాలని, అందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. మతాలకు, కులాలకు అతీతంగా ప్రజలు హోలీ సంబరాలు జరుపుకున్నారని ఆయన పేర్కొన్నారు. పెద్దపల్లి జిల్లా మరియు నియోజకవర్గ ప్రజలందరికీ హోలీ శుభాకాంక్షలు తెలిపారు.

# మైలారం మైసమ్మ గుట్ట వద్దనుండి బ్రిడ్జి నిర్మాణం కోరుతూ వినతి



**గన్నేరువరం, మార్చి 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మైలారం మైసమ్మ గుట్ట నుండి కరీంనగర్ సప్తగిరి కాలనీ వరకు మానేరు నదిపై బ్రిడ్జి నిర్మాణం జరగాలని రోడ్లు, భవనాల శాఖ ఈఈకి మండల సర్పంచుల ఫోరం ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. గత 15 సంవత్సరాలుగా గన్నేరువరం, బెజ్జంకి, ఇల్లంతకుంట మండలాల ప్రజలు ఈ బ్రిడ్జి నిర్మాణం కోసం పోరాటాలు చేస్తూ వస్తున్నారు. మానేరు మైసమ్మ గుట్ట వద్దనుండి కరీంనగర్‌కు అలైన్మెంట్ మార్చి బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని వారు కోరారు. సోమవారం మండలంలోని సర్పంచులు కలిసి ఈ వినతి పత్రాన్ని సమర్పించారు.

### ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక కారక్రమంలో కలెక్టర్ చిత్రా మిశ్రా



**కరీంనగర్, మార్చి 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో మార్చి 6 నుండి జూన్ 12 వరకు 99 రోజుల పాటు ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమం అమలు చేయనున్నారు. ఈ కార్యక్రమంపై అమలు విధానాలను చర్చించేందుకు మంగళవారం హైదరాబాద్ సచివాలయంలో ఉన్నతాధికారులు, జిల్లాల కలెక్టర్లతో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కరీంనగర్ జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా పాల్గొన్నారు.

# శిశు మందిర్‌లో ఘనంగా హోలీక పౌర్ణమి యజ్ఞం



**కరీంనగర్, మార్చి 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
స్థానిక సరస్వతి శిశు మందిర్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌లో హోలీ పండుగ సందర్భంగా హోలీక పౌర్ణమి యజ్ఞం ఘనంగా నిర్వహించారు. ఈ యజ్ఞంలో పాఠశాల కార్యదర్శి కోల అన్నా రెడ్డి, తణుకు మహేష్--శైలజ, ఎలగందుల శ్రీనివాస్, పులల శ్యామ్ పాల్గొన్నారు. శంకర్ ఆర్యన్ యజ్ఞాన్ని గావించారు. హోలీ పండుగ మన జీవితంలో ఆనందం, ప్రేమ, స్నేహం, ఐక్యతను పెంపొందించే పవిత్రమైన పండుగ అని, రంగుల ద్వారా మనసులు కలిసే రోజు ఇదేనని పాఠశాల ప్రధానాచార్యులు సముద్రాల రాజమౌళి పేర్కొన్నారు.

# ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్‌కు మహానంది అవార్డు



**కరీంనగర్, మార్చి 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హన్మకొండ పబ్లిక్ గార్డెన్‌లో జరిగిన నీరజ ఓరుగల్లు స్వరాల జల్లు మెగా మ్యూజికల్ ఈవెంట్ అనంతరం కరీంనగర్ పోచమ్మవాడకు చెందిన కవి, రచయిత, లఘు చిత్రాల దర్శకుడు, నటుడు పసుల రవికుమార్‌కు 2025--26 సంవత్సరానికి మహానంది పురస్కారం అందజేశారు. వేములవాడ ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తూ, ఇండియన్ ఐకాన్ అవార్డు గ్రహీతగా, సామాజిక సేవకుడిగా గుర్తింపు పొందిన రవికుమార్‌కు ఈ అవార్డు పలువురు ప్రముఖుల చేతుల మీదుగా అందజేయబడింది. ఈ కార్యక్రమానికి సినిమా గేయ రచయితలు, గాయకులు ప్రణయ్ కుమార్, గంటాడి కృష్ణ, తార అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకే రాజేష్, స్వరాల జల్లు అధ్యక్షురాలు నీరజ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ, మహానంది పురస్కారం అందుకోవడం తన అదృష్టంగా భావిస్తున్నానని, ఇకపై కూడా సామాజిక సేవలు కొనసాగిస్తూ ప్రజలకు ఉపయోగపడే లఘు చిత్రాలు నిర్మిస్తానని తెలిపారు.

# తెలంగాణ ఉద్యమకారులను గుర్తించిన హైకోర్టు



**అమ్రాబాద్, మార్చి 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్ దేశోద్ధారక భవన్‌లో తెలంగాణ ఉద్యమకారులు రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. గొల్లపల్లి నాగరాజు, అబ్బు రాథోడ్, కాట్రావత్ శ్రీను సహా మరో ఆరుగురు ఉద్యమకారులు ఫిబ్రవరి 9న పిటిషన్ వేశారు. ఫిబ్రవరి 23న కోర్టు నం. 04లో జస్టిస్ విజయ్ సేన్ రెడ్డి ఇరువాదనలు విని ఉద్యమకారులకు అనుకూలంగా తీర్పు ఇచ్చారు. ఈ కేసులో ఉద్యమకారుల తరఫున వాదనలు వినిపించిన అడ్వకేట్ కరుణాకర్ రెడ్డిని తెలంగాణ ఉద్యమ సంఘాల నాయకులు ఘనంగా సన్మానించారు. అలాగే పిటిషన్ వేసిన 9 మంది ఉద్యమకారులను హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్, అడ్వకేట్ కరుణాకర్ రెడ్డి, ఉద్యమ సంఘాల నాయకులు ఆత్మీయంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ నేతలు కరుణాకర్ దేశ్, డాక్టర్ మొహమ్మద్ అబ్దుల్ షోయబ్, రాములు, తెలంగాణ వెంకన్న, సునీల్, సుల్తాన్ యాదగిరి, వెంకటేశం గౌడ్ గుర్జాని, తెలంగాణ జానకి రెడ్డి, జేఏసీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా హోలీ సంబరాలు





**భగత్‌నగర్/ ఇంద్రానగర్/ పాలకుర్తి/ బొమ్మకల్)కరీంనగర్, మార్చి 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ నగరంలో హోలీ సంబరాలు ఉత్సాహంగా, రంగుల కేళితో అంబరాన్ని అంటాయి. భగత్‌నగర్‌లో డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు కార్యాలయం ఆవరణలో జరిగిన హోలీ వేడుకల్లో ప్రజలు, చిన్నా పెద్దా తేడా లేకుండా పాల్గొని రంగులు చల్లుకుంటూ ఆనందించారు. సంగీతం, నృత్యాలతో సందడి నెలకొంది. హోలీ అనేది ఐక్యతకు ప్రతీక అని, ప్రజలు సురక్షితంగా పండుగ జరుపుకోవాలని సునీల్ రావు సూచించారు. ఇంద్రానగర్ కాలనీలో యువత, చిన్నారులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని రంగుల పండుగను ఘనంగా జరుపుకున్నారు. డీజే పాటలతో యువత చిందులేయగా, కాలనీలోని ప్రతి గల్లీ రంగులతో నిండిపోయింది. ఈసారి ప్రజలు ఆర్గానిక్ రంగులను వాడటం పట్ల అవగాహన ప్రదర్శించారు. సోమవారం కామదహనం అనంతరం మంగళవారం రంగుల కేళి పరాకాష్టకు చేరింది. పాలకుర్తి మండలంలో మాత్రం చంద్రగ్రహణం కారణంగా హోలీ సంబరాలకు ప్రజలు దూరంగా ఉన్నారు.







ప్రభుత్వం సెలవు ప్రకటించినప్పటికీ, గ్రహణం కారణంగా ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. దేవాలయాలు మధ్యాహ్నం మూసివేసి, గ్రహణం అనంతరం శుద్ధి చేసి పూజలు నిర్వహించారు. కరీంనగర్ రూరల్ మండలం 6వ డివిజన్ బొమ్మకల్‌లో హోలీ వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రజలు, యువకులు రంగులు పూసుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పాటలు, నృత్యాలతో సందడి నెలకొంది. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మేకల వెంకటేష్, మాజీ సర్పంచ్ పురుమల్ల శ్రీనివాస్, యువకులు పెద్ది లక్ష్మణ్, శ్రీధర్, మారుతి, మల్లేష్, అశోక్, కృష్ణతో పాటు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# వినూత్న నిరసన చేపేసిన ముత్యాల జగన్ రెడ్డి

**గన్నేరువరం, మార్చి 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హోలీ పండుగ రోజున గన్నేరువరం మండలంలో డబుల్ రోడ్డు నిర్మాణంలో నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ ముత్యాల జగన్ రెడ్డి వినూత్న నిరసన చేపట్టారు. మొహంపై రంగు చల్లుకుని నడి రోడ్డుపై కూర్చొని హ్యాపీ హోలీ అంటూ ప్రజల సమస్యలను వెలుగులోకి తెచ్చారు. గుండ్లపల్లి--పొత్తూరు రహదారి దుస్థితిని ఎండగట్టిన ఆయన, దశాబ్దాలుగా ప్రజలు ఎదురుచూస్తున్న ఈ రహదారి ప్రతి ఎన్నికల సమయంలో హామీలకే పరిమితమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం 71 కోట్ల రూపాయల జి.ఓ. తీసుకొచ్చి శంకుస్థాపన చేసి ప్రచారంతో సరిపెట్టుకుందని, ఇప్పుడు



కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే 100 రోజుల్లో రోడ్డు నిర్మిస్తా అని హామీ ఇచ్చి ఉన్న రహదారినే చెడగొట్టి ప్రజల ప్రాణాలతో ఆటలాడుతున్నారని ఆరోపించారు. కంకర రాళ్లు ఎగిరిపడి చిన్నారులు, వృద్ధులు గాయపడుతున్నారని, ప్రజల ముఖాలపై రక్తపు మచ్చలు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాకాలం వస్తే మండలం మొత్తం జలదిగ్బంధనానికి గురవుతుందని, అంబులెన్స్ కూడా రాలేని పరిస్థితి తలెత్తుతుందని హెచ్చరించారు. ఓట్లేసిన పాపానికి ప్రజలు రక్తం కళ్లతో చూడాలా? అంటూ సీఎం రేవంత్ రెడ్డిని నిలదీశారు. వెంటనే రహదారి నిర్మాణం చేపట్టి ప్రజల ప్రాణాలను రక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.

# బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, డీజేలు, డ్రోన్లపై నిషేధాజ్ఞలు కొనసాగింపు

**కరీంనగర్, మార్చి 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఐపీఎస్ ఒక ప్రకటనలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, డీజే సౌండ్ల వినియోగం, డ్రోన్లు మరియు ఇతర సాంకేతిక పరికరాల వినియోగంపై అమల్లో ఉన్న నిషేధాజ్ఞలను ఈ నెల 31 వరకు పొడిగిస్తున్నట్లు తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం వల్ల సాధారణ ప్రజలు, ముఖ్యంగా మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వీధుల్లో అసభ్య పదజాలం, అల్లర్లు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ప్రజల భద్రత కోసం ఈ నిషేధాన్ని కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఉల్లంఘన చేసిన వారిపై ఐపీసీ 188, హైదరాబాద్ నగర పోలీస్ చట్టం, ఫసలీ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీజే సౌండ్ల



వినియోగం వల్ల చిన్నపిల్లలు, వృద్ధులు, రోగులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, శబ్ద కాలుష్యం నివారణ కోసం నిషేధాన్ని పొడిగించినట్లు తెలిపారు. అవసరమైతే సంబంధిత ఏసీపీ అనుమతి తీసుకుని మైక్ సెట్ వినియోగించుకోవాలని సూచించారు. భద్రతా కారణాల దృష్ట్యా డ్రోన్లు, పారా గ్లైడర్స్, రిమోట్ కంట్రోల్ మైక్రోలైట్ ఎయిర్‌క్రాఫ్ట్‌ల వినియోగాన్ని నిషేధించారు. ఉగ్రవాదులు, అసాంఘిక శక్తులు వీటిని వినియోగించే అవకాశాలు ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. వినియోగించాలనుకుంటే సంబంధిత పోలీసుల అనుమతి తప్పనిసరి అని పేర్కొన్నారు. కమిషనరేట్ పరిధిలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని గౌష్ ఆలం స్పష్టం చేశారు. అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ఊరేగింపులు నిర్వహించరాదని, ఆయుధాలు ధరించి సంచరించరాదని హెచ్చరించారు.

## పౌర్ణమి సందర్భంగా కొండగట్టు ఆంజనేయ స్వామి దేవాలయంలో 38వ గిరి ప్రదర్శన



**కరీంనగర్, మార్చి 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పౌర్ణమి సందర్భంగా కొండగట్టు ఆంజనేయ స్వామి దేవాలయంలో 38వ గిరి ప్రదిక్షణ ఘనంగా నిర్వహించారు. సురేష్ ఆత్మారం గురువు ఆధ్వర్యంలో వాసవీ క్లబ్ కాపుల్స్ కరీంనగర్ అధ్యక్షుడు జిల్లా జగదీష్, పైద శ్రీనివాస్, పెద్ది శ్రీనివాస్, శ్రీనివాసుల సంగం వ్యవస్థాపకులు వూట్కోరి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా 10 వేల మంది భక్తులు హనుమాన్ చాలీసా పారాయణం, శ్రీరామనామ సంకీర్తనలతో వైభవంగా కార్యక్రమాన్ని నిర్వహించారు.


## ఘనంగా బ్లూ బెల్స్ స్కూల్‌లో 12వ వార్షికోత్సవ వేడుకలు



**కరీంనగర్, మార్చి 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: హనుమాన్ నగర్‌లోని బ్లూ బెల్స్ స్కూల్‌లో 12వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నలువాల పుష్పలత రవీందర్ (భగవంతయ డీసీబ్ సెక్రటరీ, కరీంనగర్), కే. శ్రీనివాస్ (చైర్మన్, అస్పెక్టిస్ సాఫ్ట్వేర్ కంపెనీ), కే.ఎస్. అనంతచార్య, మడిశెట్టి గోపాల్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జంగా సునీత మనోహర్ రెడ్డి హాజరై విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు, నాటికలు, పాటలు ప్రదర్శించి ప్రేక్షకులను అలరించారు. విద్యార్థుల ప్రతిభను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రశంసించారు. ప్రధానోపాధ్యాయులు జంగా సునీత మనోహర్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని, ఈ వేడుక విజయవంతంగా నిర్వహించిన ఉపాధ్యాయ సిబ్బందికి, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

## యూట్యూబ్‌లో ప్రధాని మోదీ రికార్డు..

### 3 కోట్ల మంది సబ్‌స్క్రైబర్లు




**న్యూఢిల్లీ మార్చి 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
సోషల్ మీడియా ఫ్లాట్‌ఫామ్‌ల్లో ప్రధాని మోదీ రికార్డులు సృష్టిస్తున్నారు. యూట్యూబ్‌లో కీలక మైలురాయిని ఆయన దాటేశారు. యూట్యూబ్‌లో ప్రధాని మోదీ ఛానల్‌ను సబ్‌స్క్రైబ్ చేసిన వారి సంఖ్య 3 కోట్లు దాటింది. అయితే ఈ ఫ్లాట్‌ఫామ్‌లో అత్యధిక సంఖ్యలో ఫాలోవర్లు ఉన్న ప్రపంచ నేతగా మోదీ రికార్డు సృష్టించారు. గత వారం ఆయన ఇన్‌స్టాగ్రామ్‌లో కూడా ఘనత సాధించిన విషయం తెలిసిందే. అత్యధిక సంఖ్యలో యూజర్లు ఇన్‌స్టాలో మోదీని ఫాలోఅవుతున్నారు.ప్రపంచ దేశాధినేతల్లో అత్యధిక సంఖ్యలో యూట్యూబ్ సబ్‌స్క్రైబర్లు ఉన్న నేతగా ప్రధాని మోదీ నిలిచినట్లు తాజా ర్యాంకింగ్స్ చెబుతున్నాయి. అయితే ఆ ర్యాంకింగ్స్ ప్రకారం ఆయన ఇతర నేతలతో పోలిస్తే చాలా చాలా ముందున్నారు. ఇక ఆ జాబితాలో రెండో స్థానంలో బ్రెజిల్ అధ్యక్షుడు జెయిర్ బొల్సనారో ఉన్నారు. ప్రధాని మోదీకి ఉన్న ఫాలోవర్లలో నాలుగో వంతు మాత్రమే బొల్సనారోను ఫాలో అవుతున్నారు.అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కన్నా ఏడు రెట్లు అధికంగా ప్రధాని మోదీకి యూట్యూబ్ సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. ఇక ఇండియాలో అత్యధిక మంది సబ్‌స్క్రైబర్లు ప్రధాని మోదీకే ఉన్నారు. రాహుల్ గాంధీ కన్నా ఆయనకు మూడు రెట్లు అధికంగా ఫాలోవర్లు ఉన్నారు. 30 మిలియన్ల మంది సబ్‌స్క్రైబర్లతో .. మోదీ యూట్యూబ్ ఛానల్.. ప్రపంచవ్యాప్తంగా నెంబర్ వన్ స్థానంలో ఉన్నది.

# పహల్గామ్ ఉగ్రదాడి.. దర్యాప్తులో కీలక విషయం వెలుగులోకి..!



**న్యూఢిల్లీ మార్చి 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జమ్ముకశ్మీర్ లోని పహల్గామ్ లో గత ఏడాది జరిగిన ఉగ్రదాడికి సంబంధించి తాజాగా కీలక విషయం వెలుగులోకి వచ్చింది. ఈ దాడి సమయంలో ఉగ్రవాదులు 'గో ప్రో హీరో 12 కెమెరా లను ఉపయోగించినట్లు జాతీయ దర్యాప్తు సంస్థ గుర్తించింది. చైనాకు చెందిన ఏఈ గ్రూప్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ వద్ద ఈ 'గో ప్రో' కెమెరాలు ఉన్నట్లు తెలుసుకుంది.దాంతో ఉగ్రదాడికి వాడిన 'గో ప్రో' కెమెరాలు ఎక్కడి నుంచి వచ్చాయనే వివరాలను తెలుసుకునేందుకు చైనా సాయం కోరాలని ఎన్ఐఏ భావిస్తోంది. అందుకు జమ్ముకశ్మీర్‌లోని ప్రత్యేక న్యాయస్థానం నుంచి తాజాగా అనుమతులు లభించాయి. ఘటనా స్థలం నుంచి 'గో ప్రో హీరో 12 మోడల్ బ్లాక్ కెమెరాల' ను ఎన్ఐఏ స్వాధీనం చేసుకుంది. ఈ కెమెరాల్లోని సమాచారం బయటికి తీయగలిగితే.. దాడికి ముందు ఉగ్రవాదుల కదలికలు, ప్రణాళికల గురించి తెలుసుకోవడంలో ఇవి కీలకంగా మారనున్నాయి. గత ఏడాది ఏప్రిల్ 18న పహల్గాం ఉగ్రదాడి జరిగింది. దానికి ఏడాది ముందు చైనాకు చెందిన ఏఈ గ్రూప్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ వద్ద ఈ 'గో ప్రో కెమెరాలు' ఉన్నట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. 2024 జనవరి 30న చైనాలోని డోంగ్వాన్‌లో ఈ కెమెరాలు యాక్టివేట్ అయినట్లు ఎన్ఐఏ అధికారులు తెలుసుకున్నారు. ఆ తర్వాత కెమెరా తయారీదారు 'గో ప్రోబీవీ' కి నోటీసులు జారీచేశారు. అయితే వాటి లావాదేవీలకు సంబంధించి ఎలాంటి రికార్డులు లేవని తయారీదారులు పేర్కొన్నట్లు తెలిపారు.ఈ క్రమంలో వీటిని ఎవరు కొనుగోలు చేశారు..? చివరిగా ఎవరు వినియోగించారు..? అనే వివరాలు తెలుసుకోవడానికి చైనా సాయం కోరేందుకు ఎన్ఐఏ సిద్ధమైంది. దీనికి సంబంధించి చైనా న్యాయశాఖ అధికారికి లేఖ రాయనుంది. అందుకు భారత

# ఇరాన్‌లో 4.3 తీవ్రతతో భూకంపం..

### అణు కేంద్రాలపై భయాందోళనలు



**టెహ్రాన్ మార్చి 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: ఇరాన్‌లోభూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై 4.3 తీవ్రతగా నమోదు అయ్యింది. దక్షిణ ఇరాన్‌లోని ఫార్స్ ప్రావిన్సులో ఉన్న ఖోంజ్ వద్ద భూకంప కేంద్రం ఉన్నది. భూమికి సుమారు 10 కిలోమీటర్ల లోతులో ప్రకంపనలు నమోదు అయినట్లు అమెరికా జియోలాజికల్ సర్వే పేర్కొన్నది. స్థానిక కాలమానం 10.24 నిమిషాలకు భూకంపం వచ్చినట్లు తెలుస్తోంది. గిరశ్ అనే పట్టణానికి 55 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం ఉన్నది. 4.3 తీవ్రత భూకంపాన్ని స్వల్ప స్థాయి నుంచి మధ్యస్థాయి ప్రకంపనగా భావిస్తారు. భూకంప కేంద్రానికి సమీపంలో ఉన్న వారు షేక్ అయి ఉంటారు. కానీ బిల్డింగ్‌లకు ఎటువంటి ప్రమాదం జరిగి ఉండదని భావిస్తున్నారు. సునామీ వార్నింగ్ ఇవ్వలేదు. దక్షిణ ఇరాన్ భూకంపాలు వచ్చే జోన్‌లోనే ఉన్నది.మరోవైపు ఇజ్రాయెల్-అమెరికా వైమానిక దాడులు చేస్తున్న విషయం తెలిసిందే. నటాంజ్‌లోని అండర్‌గ్రౌండ్ యురేనియం శుద్దీకరణ ప్లాంట్‌పై అమెరికా దళాలు దాడి చేసినట్లు స్పష్టం అయ్యింది. కొలరాడోకు చెందిన వాంటర్ కంపెనీ రిలీజ్ చేసిన శాటిలైట్ చిత్రాల ద్వారా ఈ విషయం తెలిసింది. ఆదివారం మధ్యాహ్నం నుంచి సోమవారం ఉదయం లోపే నటాంజ్ అణు కేంద్రంలో మార్పులు సంభవించినట్లు గుర్తించారు. అయితే ఆ మార్పులకు చెందిన స్పష్టమైన సంకేతాలు శాటిలైట్ చిత్రాల్లో కనిపిస్తున్నట్లు అణు నిపుణుడు డేవిడ్ ఆల్‌బ్రైట్ పేర్కొన్నారు.అయితే ఆ అణు కేంద్రంపై అమెరికానా లేక ఇజ్రాయిల్ దాడి చేసిందా అన్న విషయాన్ని చెప్పలేకపోయారు. వాంటర్ రిలీజ్ చేసిన పిక్స్ ప్రకారం.. నటాంజ్ న్యూక్లియర్ కాంప్లెక్స్‌లో కొన్ని బిల్డింగ్‌లు ధ్వంసం అయ్యాయి. మార్చి 1, మార్చి 2వ తేదీల్లో తీసిన చిత్రాలను వాంటర్ రిలీజ్ చేసింది. మార్చి 2వ తేదీన తీసిన చిత్రాల్లో కొన్ని బిల్డింగ్‌లు ధ్వంసమైనట్లు గుర్తించారు. గత ఏడాది జూన్‌లో కూడా ఇజ్రాయిల్ దళాలు నటాంజ్ కేంద్రంపై దాడి చేసిన విషయం తెలిసిందే. అయితే గత ఆదివారం కూడా మళ్లీ ఆ కేంద్రంపైనే అమెరికా, ఇజ్రాయెల్ కలిసి దాడి చేసినట్లు ఇరాన్ ఆరోపించింది. ఐక్యరాజ్యసమితికి చెందిన అటామిక్ ఎనర్జీ సంస్థకు ఈ అంశం గురించి ఇరాన్ అటామిక్ ఎనర్జీ చీఫ్ ఇస్లామి లేఖ రాశారు.

# మరో యుద్ధానికి భారత్ సన్నాహాలు..


### పాకిస్థాన్ అధ్యక్షుడు జర్దారీ ఆరోపణలు



**న్యూఢిల్లీ మార్చి 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఎప్పుడూ అనుచిత వ్యాఖ్యలు చేస్తూ భారత్ ను కవ్వించడానికి పాకిస్థాన్ ప్రయత్నిస్తూనే ఉంటుంది. తాజాగా ఈ బాధ్యతలను ఆ దేశ అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ తీసుకున్నాడు. తమ దేశంతో మరో యుద్ధం చేయడానికి భారత్ సన్నాహాలు చేస్తోందని అనుచిత ఆరోపణ చేశాడు. సింధూ జలాల ఒప్పందం రద్దుపై ఆయన మాట్లాడుతూ.. రాజకీయ అవసరాల కోసం భారత్ నీటిని ఆయుధంలా వాడుకుంటున్నదని అక్కసు వెళ్లగక్కారు.ప్రాంతీయ శాంతికి మద్దతుదారుగా తాను ఇలాంటి చర్యలను వ్యతిరేకిస్తున్నానని జర్దారీ తెలిపారు. భారత అధికారులు యుద్ధం చేయాలన్న ఆలోచనల నుంచి వెనక్కి తగ్గి తమతో చర్చలకు రావాలని అన్నారు. జమ్మూకశ్మీర్ సమస్యను పరిష్కరించడానికి, కశ్మీర్‌లోని ప్రజలకు అవసరమైన దౌత్యపరమైన సాయాన్ని అందించడానికి పాకిస్థాన్ సిద్ధంగా ఉందని చెప్పారు. అదేవిధంగా పాకిస్థాన్‌లో శాంతిని అస్థిరపరిచేందుకు అఫ్గాన్ ప్రయత్నాలు చేస్తోందని, వాటిని అడ్డుకోవడానికి తమ దళాలు తీవ్రంగా కృషి చేస్తున్నాయని తెలిపారు. అదేవిధంగా పశ్చిమాసియాలో కొనసాగుతున్న సంఘర్షణను జర్దారీ ఖండించారు. ఇరాన్ సుప్రీం నేత ఖమేనీ మృతికి సంతాపం తెలిపారు. యూఏఈ, బహ్రెయిన్, జోర్డాన్, కువైట్, ఖతార్, సౌదీ అరేబియా లాంటి గల్ఫ్ దేశాలపై దాడులు

# పశ్చిమాసియా ఘర్షణలు

### ముగ్గురు భారత నావికుల మృతి




**న్యూఢిల్లీ మార్చి 3 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పశ్చిమాసియా ఘర్షణల్లో ఇప్పటివరకు భారతదేశానికి చెందిన ముగ్గురు నావికులు మృతి చెందినట్లు షిప్పింగ్ డైరెక్టర్ జనరల్ వెల్లడించింది. ఒమన్ తీర ప్రాంతాల్లో ఉన్న పలు వాణిజ్య నౌకలపై ఇరాన్ చేసిన దాడుల్లో ముగ్గురు భారతీయులు మృతిచెందగా మరొకరు తీవ్రంగా గాయపడినట్లు తెలిపింది. ఈ నేపథ్యంలో షిప్ ఆపరేటర్లకు అడ్వైజరీ జారీ చేసింది. గల్ఫ్ ఆఫ్ ఒమన్, హోర్ముజ్ జలసంధి, పర్షియన్ గల్ఫ్‌లో పరిస్థితులను గమనిస్తున్నామని పేర్కొంది. ఆయా ప్రాంతాల్లో క్షిపణి, డ్రోన్ కార్యకలాపాలకు సమస్యలు ఉన్నట్లు గుర్తించామని తెలిపింది. షిప్ ఆపరేటర్ల భద్రతను కచ్చితంగా దృష్టిలోఉంచుకోవాలని.. అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే రిపోర్టు చేయాలని సూచించింది. తాజా నివేదికల ప్రకారం.. భారత జెండా ఉన్న నౌకలను బంధించినట్లు ఎటువంటి సమాచారం రాలేదని షిప్పింగ్ డైరెక్టర్ జనరల్ శ్యామ్ జగన్నాథన్ పేర్కొన్నారు. ఇప్పటివరకు రక్షించిన సిబ్బందిని స్వదేశానికి రప్పించడానికి ఒమన్‌లోని భారత రాయబార కార్యాలయం చర్యలు తీసుకుంటుందన్నారు. పశ్చిమాసియా లో ఉద్రిక్తతలు పెరుగుతున్నందున పర్షియన్ గల్ఫ్ సమీపంలో చిక్కుకొన్న భారతీయ నావికులకు తక్షణ సాయం అందించడానికి.. వారిని భారత్‌కు తరలించడానికి ప్రత్యేక ప్రతిస్పందన బృందాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. యుద్ధం వల్ల ప్రభావితులైన భారత నావికులతో ఈ బృందంలోని అధికారులు నిరంతరం సంప్రదింపులు జరుపుతారన్నారు. నావికుల కుటుంబాలు, షిప్పింగ్ కంపెనీలు, ట్రేడ్ యూనియన్లు, విదేశాలలో ఉన్న భారతీయ మిషన్లు, సంబంధిత పోర్ట్ అధికారులతోనూ ఈ బృందం సమన్వయం చేసుకుంటుందన్నారు.

# రెచ్చిపోతున్న రకుల్ ప్రీత్ సింగ్..

## పెళ్లి తర్వాత పెరిగిన గ్లామర్ డోస్.. అందుకేనా..?



రకుల్ ప్రీత్ సింగ్ లేటెస్ట్ ఫోటోషూట్స్ చూస్తుంటే కుర్రకారుకు మతిపోవడం ఖాయం. వామ్మో ఈ బ్యూటీ అస్సలు తగ్గట్లేదుగా! అని నెటిజన్లు ఆశ్చర్యపోయే స్థాయిలో ఆమె గ్లామర్ షో ఉంటోంది. రీసెంట్‌గా ఓ అవార్డు ఫంక్షన్‌కు హాజరైన రకుల్.. నెక్స్ట్ లెవల్ క్లీవేజ్ షోతో అందరి దృష్టిని తన వైపు తిప్పుకుంది. కుమారి నుంచి శ్రీమతిగా మారిన తర్వాత రకుల్ గ్లామర్ డోస్ తగ్గిస్తుందేమో అనుకున్న వాళ్లందరికీ.. తన హాట్ ఫోటోషూట్స్‌తో దిమ్మతిరిగే ఆన్సర్ ఇస్తోంది. కుమారిగా ఉన్నప్పటి కంటే ఇప్పుడు శ్రీమతిగా మారిన తర్వాతే ఆమె మరింత బోల్డ్‌గా కనిపిస్తూ ఆశ్చర్యపరుస్తోంది. సాధారణంగా పెళ్లి తర్వాత హీరోయిన్లు కాస్త పద్ధతిగా, గ్లామర్ రోల్స్‌కు దూరంగా ఉంటారనే ఒక అపోహ ఇండస్ట్రీలో ఉంది. కానీ రకుల్ ఆ రూల్‌ను బ్రేక్ చేస్తూ రెచ్చిపోతోంది. పెళ్లి తర్వాతే ఆమె గ్లామర్ డోస్ మరింత పెంచేసిందా అన్నట్లుగా సోషల్ మీడియాలో క్రమం తప్పకుండా హీట్ పెంచుతోంది. ఫిట్‌నెస్‌లో ఎప్పుడూ ముందుండే రకుల్, తన పర్ఫెక్ట్ ఫిగర్‌ను హైలైట్ చేస్తూ చేస్తున్న ఈ ఫోటోషూట్స్ ఇప్పుడు నెట్టింట వైరల్‌గా మారుతున్నాయి. ఏ ఈవెంట్‌కు వెళ్లినా స్పెషల్ అట్రాక్షన్‌గా నిలుస్తూ హాట్ టాపిక్ అవుతోంది. అయితే ఈ రేంజ్ గ్లామర్ షో వెనుక అసలు కారణం అవకాశాల కోసమేనా? అనే చర్చ ఇప్పుడు ఇండస్ట్రీ సర్కిల్స్‌లో జోరుగా సాగుతోంది. నిజానికి ఒకప్పుడు టాలీవుడ్, బాలీవుడ్ అని తేడా లేకుండా చేతినిండా సినిమాలతో బిజీగా ఉన్న రకుల్‌కు.. పెళ్లి తర్వాత మునుపటిలా ఆఫర్లు రావడం లేదనేది వాస్తవం. కొత్త హీరోయిన్ల ఎంట్రీతో కాంపిటీషన్ విపరీతంగా పెరిగిపోవడం, పైగా మ్యారీడ్ స్టేటస్ వల్ల మేకర్స్ ఆమెను యంగ్ హీరోల సరసన కమర్షియల్ రోల్స్‌కు కన్సిడర్ చేయడంలో కాస్త వెనకడుగు వేస్తుండొచ్చు. ఈ గ్యాప్‌ను ఫిల్ చేయడానికే రకుల్ ఈ రూట్ ఎంచుకుందని అర్థమవుతోంది. సరిగ్గా ఇలాంటి టైమ్‌లోనే తాను ఇంకా రేసులో ఉన్నానని.. ఎలాంటి కమర్షియల్ గ్లామర్ రోల్స్ చేయడానికైనా తను రెడీ అని మేకర్స్‌కు ఒక గట్టి సిగ్నల్ ఇవ్వడానికే రకుల్ ఈ స్ట్రాటజీ ప్లే చేస్తుందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ రోజుల్లో సోషల్ మీడియా అనేది హీరోయిన్లకు ఒక పెద్ద మీడియం. అందులో యాక్టివ్‌గా ఉంటూ, ట్రెండింగ్ ఫోటోషూట్స్‌తో వార్తల్లో నిలిస్తేనే దర్శక నిర్మాతలకు గుర్తుంటారు. ఈ గ్లామర్ షోల ద్వారా నేను ఇంకా ఫిట్‌గా, హాట్‌గా ఉన్నాను.. మునుపటి కంటే మరింత గ్లామరస్‌గా కనిపిస్తాను అని ప్రూవ్ చేసుకునే ప్రయత్నం చేస్తోంది ఈ బ్యూటీ. మరి ఈ గ్లామర్ షోతో రకుల్ మళ్లీ ఫుల్ ఫామ్‌లోకి వస్తుందా, రేసులో నిలబడుతుందా? అంటే కాలమే సమాధానం చెప్పాలి.




# 'పెద్ది' రన్‌టైమ్‌పై క్లారిటీ.. ఆ వార్తలన్నీ పుకార్లేనన్న చిత్ర యూనిట్!

రామ్‌చరణ్, బుచ్చిబాబు కాంబోలో వస్తున్న భారీ యాక్షన్ డ్రామా 'పెద్ది' గురించి సోషల్ మీడియాలో వస్తున్న పుకార్లకు చిత్ర యూనిట్ చెక్ పెట్టింది. సినిమా నిడివి విషయంలో జరుగుతున్న ప్రచారాన్ని ఖండిస్తూ అధికారికంగా క్లారిటీ ఇచ్చింది. గత కొన్ని రోజులుగా పెద్ది సినిమా నిడివి 3 గంటలకు పైగా ఉంటుందని నెట్టింట వార్తలు చక్కర్లు కొడుతున్న సంగతి తెలిసిందే. ఈ విషయంపై టీమ్ స్పందిస్తూ.. 'ప్రస్తుతానికి ఫస్టాఫ్ ఎడిటింగ్ మాత్రమే పూర్తయింది. సెకండ్ హాఫ్ షూటింగ్ ఇంకా కొనసాగుతోంది. అలాంటప్పుడు నిడివి గురించి వస్తున్న వార్తల్లో నిజం లేదు' అని స్పష్టం చేసింది. సినిమా పనులు శరవేగంగా జరుగుతున్నాయని, ఎడిటింగ్ టేబుల్ మీద ఉన్నప్పుడు ఇలాంటి పుకార్లను నమ్మవద్దని కోరింది.



# సక్సెస్ కోసం ఎదురు చూస్తున్న శ్రీలీల

నటి శ్రీలీల ప్రస్తుతం తన కెరీర్‌లో ఒక కీలక దశలో ఉన్నారు. అకడమిక్స్‌లో విజయం సాధించినప్పటికీ, సినిమాల పరంగా ఆమెకు ఒక పెద్ద బ్లాక్ బస్టర్ అవసరం అని చర్చ జరుగుతోంది. కెరీర్ ప్రారంభంలో దూసుకుపోయిన శ్రీలీల, ఇటీవల విడుదలైన కొన్ని చిత్రాలతో ఆశించినంత విజయం సాధించలేకపోయారు. 2024 చివర్లో పుష్ప సీక్వెల్‌లోని కిస్సిక్ పాటతో వార్తల్లో నిలిచినా, 2025లో వచ్చిన జూనియర్, మాస్ జాతర, రాబిన్ హుడ్ వంటి చిత్రాలు ఆమె కెరీర్‌కు ప్రత్యేకంగా విలువను చేర్చలేదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఆ సినిమాలలోని పాటలు, కాస్ట్యూమ్స్ ఆకట్టుకున్నప్పటికీ, అవి ఆమె భవిష్యత్‌కు పెద్దగా దోహదపడలేదనే మాట వినిపిస్తోంది. అందుకే శ్రీలీల 2026 నాటి ప్రాజెక్టులపై మరింత జాగ్రత్తగా దృష్టి సారిస్తున్నారు.



# సర్‌ప్రైజ్ బ్లాక్ బాస్టర్‌గా శివకార్తికేయన్ కామెడీ డ్రామా




కోలీవుడ్‌లో ప్రేక్షకుల కొరత కారణంగా థియేటర్లు మూవీ షోలను ప్రదర్శించేందుకు ఇబ్బందులు పడుతున్నాయి. పెద్ద సినిమాలేమి అంతగా విడుదల కాలేదు. మరోవైపులో బడ్జెట్ సినిమాలు కూడా జనాలను థియేటర్లకు రప్పించడంలో విఫలమవుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో శివకార్తికేయన్ తెరకెక్కించిన Thaai Kizhavi కోలీవుడ్ ఎగ్జిబిటర్లకు ఆశాకిరణంగా మారింది. శివకార్తికేయన్ నిర్మించిన ఈ చిత్రంలో సీనియర్ నటి రాధికా శరత్ కుమార్ లీడ్ రోల్‌లో నటించింది. ఈ మూవీ ఓపెనింగ్ డే నుంచి బాక్సాఫీస్ వద్ద విమర్శకుల ప్రశంసలు అందుకుంటోంది. శని, ఆదివారం నాటికి ఈ చిత్రానికి చాలా ప్రాంతాల్లో మంచి వసూళ్లు వస్తున్నాయి. తాజా కథనాల ప్రకారం ఈ మూవీ ఓపెనింగ్ వీకెండ్‌లో రూ.22 కోట్లు సాధించి టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తోంది. చిన్న బడ్జెట్ సినిమాకు ఈ ఫిగర్ ఎక్కువేనని చెప్పాలి. లాంగ్ రన్‌లో కూడా మంచి ఆక్యుపెన్సీతో ముందుకెళుతోంది. శివకుమార్ మురగేశన్ డైరెక్ట్ చేసిన ఈ చిత్రంలో రైచల్ రబెకా, అతడి కుమరన్, సంగపులి, మునిష్కాంత్ ఇతర కీలక పాత్రల్లో నటించారు. నివాస్ కే ప్రసన్న మ్యూజిక్ అందించాడు.

# బ్లాక్ బస్టర్ మూవీ మిస్ చేసుకున్న వైష్ణవి..

## ఆ సినిమా పడుంటే రేంజే మారిపోయేది

వైష్ణవి చైతన్య.. తెలుగు సినీప్రియులకు ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేని పేరు. నటనపై ఆసక్తితో సినీరంగంలోకి అడుగుపెట్టింది. మొదట్లో చిన్న చిన్న షార్ట్ ఫిల్మ్స్ ద్వారా యూట్యూబ్ లో గుర్తింపు తెచ్చుకుంది. ముఖ్యంగా షణ్ముక్ జస్వంత్ తో కలిసి ఆమె చేసిన సాఫ్ట్ వేర్ డెవలపర్ సిరీస్ ఏ స్థాయిలో విజయం సాధించిందో చెప్పక్కర్లేదు.ఆ తర్వాత నెమ్మదిగా సినిమాల్లో చిన్న చిన్న పాత్రలు పోషించింది. షార్ట్ ఫిల్మ్స్, సినిమాలు, ఇన్ స్టా రీల్స్ ద్వారా భారీ ఫ్యాన్ బేస్ సంపాదించుకుంది. బేబీ సినిమాతో కథానాయికగా తెరంగేట్రం చేసింది. ఆనంద్ దేవరకొండ నటించిన ఈ సినిమా బ్లాక్ బస్టర్ హిట్టయ్యింది.ఈ సినిమాతో వైష్ణవి చైతన్య ఓవర్ నైట్ స్టార్ అయిపోయింది. బేబీ సినిమాతో టాలీవుడ్ లో క్రేజీ హీరోయిన్ స్టార్ స్టేటస్ సంపాదించుకున్న వైష్ణవికి.. ఆ తర్వాత తెలుగులో వరుస అవకాశాలు క్యూ కట్టాయి. బేబీ తర్వాత లవ్ మీ, జాక్ వంటి చిత్రాలతో ఆకట్టుకుంది.ప్రస్తుతం చేతిలో మరిన్ని చిత్రాలతో బిజీగా ఉంది. పదిహేనేళ్ల వయసులోనే నటిగా అవకాశాల కోసం ప్రయత్నాలు స్టార్ట్ చేసింది వైష్ణవి. గతంలో బేబీ మూవీ ప్రమోషన్లలో తన జర్నీ గురించి అనేక విషయాలు పంచుకుంది. ఓ ఈవెంట్ లో ఉదయం నుంచి సాయంత్రం వరకు డ్యాన్స్ చేస్తే ఏడు వందలు ఇచ్చారని తెలిపింది.ఇక బేబీ సినిమాకు ముందు ఆమె రెండు సినిమాలకు అగ్రిమెంట్ చేసుకుందట. అందులో ఒకటి బలగం సినిమా. బేబీ సినిమా షూటింగ్ లో బిజీగా ఉండటంతో బలగం సినిమాను మిస్ చేసుకున్నా అని తెలిపింది వైష్ణవి చైతన్య.